thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 196 | జగిత్యాల బుధవారం 28 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

టీమిండియా విధ్వంసం!



11

గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు
- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో సదస్సు
- హైదరాబాద్ అంతటా ప్రచార కార్యక్రమాలు
- తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా డిజైన్లు
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి



3

550 దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు



3

- దిల్లీలో 29న గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్
- ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు 550కిపైగా దిగ్గజ కంపెనీలకు ఆహ్వానం

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే కరువు



- కాళేశ్వరం ఆన్ చేయకుండా పంటలను ఎండబెట్టారు
- రేవంత్ కేవలం రెన్యువల్ సీఎం
- కాంగ్రెస్ దోపిడీకి వేదికగా తెలంగాణ
- 11న నిర్మల్ లో భారీ బహిరంగ సభ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 27 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలన, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నదుల్లో నీళ్లు పారుతున్నా వాటిని సాగుకు వినియోగించుకోకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో మంగళవారం చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, కేసీఆర్‌ను తిరిగి

మిగతా 3వ పేజీలో..



రాష్ట్రంలో 365 మండలాలకు కరువు నగ

- 111 మండలాల్లో తీవ్ర కరువు
- మరో 254 మండలాల్లో మోస్తరు ప్రభావం
- సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం
- రైతులకు సాయం.. తాగునీరు, పశుగ్రాసంపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, అక్టోబర్ 27:

తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో 111 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉండగా, 254 మండలాల్లో మోస్తరు ప్రభావం ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ-2) శాఖ జీఓ ఎంఎస్ నం.3 జారీ చేసింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడు అఖిలపక్షం

- భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం
- వర్షపాతం లోటు, తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ సరఫరాపై ప్రధాన చర్చ
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రాజకీయ పార్టీల నుంచి సలహాల స్వీకరణ

2



యాసంగిలో వరి సాగు చేయొద్దు

- ప్రస్తుత పంటలను కాపాడాలి
- తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో సమీక్ష

2



ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్..

పది రోజుల గడువు

- ఈసీ అఫిడవిట్‌పై సమాధానానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ చట్టబద్ధమేనని ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- బిహార్‌లో ఫారం-6 మార్పులపై మరో పిటిషన్
- ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసులు

4

సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్‌దే నాయకత్వం

- అనుసరించే స్థాయి నుంచి సృష్టించే స్థాయికి
- యువ ఆవిష్కర్తల ఆత్మవిశ్వాసంపై మోదీ ప్రశంసలు
- ప్రపంచ సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు
- 2.5 లక్షలకు చేరిన స్టార్టప్‌లు.. ఇన్నోవేషన్ సూచీలో మెరుగైన ర్యాంకు

4

కాంగ్రెస్ పాలనలో చస్తేనే పనులవుతాయా?

- సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌ను రూ. లక్ష కోట్ల అప్పుల్లో ముంచారు
- బిల్లుల కోసం చచ్చిపోవడానికీ సిద్ధమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డే అన్నారు
- రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజునుంచీ అదేమాట
- మినీ సూపర్ మార్కెట్ల ఊసేలేదు
- అసెంబ్లీ, కౌన్సిల్ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 27:

అసలు రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే.. చచ్చిపోతేనే పనులు అవుతాయా? చచ్చిపోతేనే బిల్లులు వస్తాయా? అధికార పార్టీ ఎమ్మెల్యేనే చచ్చిపోవడానికి సిద్ధమనే దుస్థితి వచ్చింది. కానీ ఎవరూ చచ్చిపోవద్దు, అందరూ బాగుండాలి. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.. అందరం కలిసి గట్టిగా కొట్లాడి బిల్లులు, డీలర్ల కమీషన్ సాధించుకుందామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం

మిగతా 2వ పేజీలో..





మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలకు విక్రయం
- రూ.15 డ్రిప్ లైన్ ధర రూ.250
- ఎన్‌పీపీఏ పనితీరుపై ధర్మాసనం అసంతృప్తి
- రోగుల ప్రయోజ్యాల కంటే వ్యాపారాలకే ప్రాధాన్యమా?

4



ఆరోగ్యమే విలువైన సంపద

- ఆయుర్వేద వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి
- సంప్రదాయ వైద్యానికి శాస్త్రీయ పరిశోధనలు తోడవ్వాలి
- కనక్కూర్ శ్రీ ధన్వంతరి ఆలయంలో మహాయాగం
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి

2

తీరు మారకుంటే కఠిన చర్యలే

- భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించను
- సర్వేను పరిశీలించి భూమి విస్తీర్ణంపై రైతులకు స్పష్టత ఇవ్వాలి
- పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

3



సివిల్ వివాదంలో లంచం బాగోతం

- రూ.10 లక్షలు డిమాండ్.. రూ.6 లక్షలకు బేరం
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి
- మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పట్టివేత

2

యాసంగిలో వరి సాగు చేయొద్దు

ఖమ్మం, అక్టోబర్ 27:

ఎల్నినో ప్రభావం వల్ల మొచ్చే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను కాపాడుకోవాలని, రాబోయే యాసంగిలో వరి సాగుకు బదులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేయాలి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్లో కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్లతో కలిసి మంత్రి తుమ్మల ఎల్నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారు దల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భజలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరి స్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వా రా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రువు పరిస్థితులు,
మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమా చారం అందించాలని అన్నారు. ఈ నెలాఖ రు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివ రించాలని, ప్రజలను అప్ర మత్తం చేయాలని సూచించారు.

యాసంగిలో సాగునీటి లభ్యత లేదు

రాబోయే యాసంగి సీజన్లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులు అధిక నీరు అవ సరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండా లని, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, కూర గాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంట లను సాగు చేయాలని సూచించారు. ఎక్క డా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని, పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధి కారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవ సరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. త్రాగునీటిని వాహనాల శుభ్రత, తోటల పెంపకం వంటి అవ సరాలకు వినియోగించకుండా ప్రజలకు అపగాహన కల్పించాలని అన్నారు. నాగార్డు నసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి, పాలేరు వర కు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతా రామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్ హౌస్లను వినియోగించి సాధ్యమైనం త ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగు నీటి అవసరాలకు ఉపయోగపడేలా చూడా లన్నారు. దుమ్ముగూడెం టెయిల్పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి

పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని మంత్రి అధికారులు ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, సిండికేట్లు ఏర్పడకుండా మా ర్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ను పొదుపుగా విని యోగించాలని మంత్రి సూచించారు. వ్యవ సాయ విద్యుత్ సరఫరా సమయాలపై రైతు లకు ముందుగానే సమాచారం అందించా లని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించకుండా. చూడాలని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో వీధి దీపాలను దశలవారీగా సౌర విద్యుత్తో నిర్వహించే అవకాశాలను పరిశీ లించాలని సూచించారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన. కల్పించాలని అన్నారు. 1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముం పునకు గురైన సమయంలో ప్రజలకు ఆహా రం. త్రాగునీరు అందించి అధికారులు సమ రంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుడా చైర్మ న్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉఅధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 365 మండలాలకు కరువు సెగ

మొదటిపేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.
జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ వ్యవధిలో 740.6 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 17 శాతం లోటు ఏర్పడింది. దీర్ఘకాలికంగా నెలకొన్న పొడి వాతావరణం, నేలలో తేమ తగ్గడం కూడా కరువు తీవ్రతకు కారణమయ్యాయి. ఈ పరిస్థితుల ప్రభావంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. మొత్తంగా 13.22 లక్షల ఎకరాల్లో సాగు తగ్గినట్లు ప్రభుత్వం గుర్తించింది. వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఇది 18 శాతం తగ్గుదలకు సమానం. రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 179.63 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుల మొత్తం సామర్థ్యం 585 టీఎంసీలు. నీటి నిల్వలు తగ్గడం వల్ల తాగునీరు, వ్యవసాయం, పశుసంపద, విద్యుత్ అవసరాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం పేర్కొంది.
శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా కరువు మండలాలను గుర్తించినట్లు ఉత్తర్వుల్లో వివరించారు. వర్షపాతం గణాంకాలతోపాటు సాగు విస్తీర్ణంలో మార్పులు, రిమోట్ సెన్సింగ్ ద్వారా గుర్తించిన వృక్ష సంపద పరిస్థితి, నేలలో తేమ, భూగర్భ జలాల స్థాయిని పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలు నిర్వహించారు. కలెక్టర్ల ప్రతిపాదనలు, వివిధ శాఖల నివేదికలను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 23న జరిగిన కేబినెట్ ఉపసంఘం సమీక్షలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాలని సిఫారసు చేసింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.
కరువు మండలాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరచడం, పశుగ్రాసం అందుబాటులో ఉంచడం, అవసరమైన చోట పశువుల శిబిరాలు ఏర్పాటు చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని కలెక్టర్లను ఆదేశించింది. అర్హులైన రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖకు సూచించింది. జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్) నుంచి కేంద్ర సాయం అందిన తేదీ నుంచి నెలలోపు ప్రభావిత రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ చేయాలని పేర్కొంది. లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్ల వెబ్సైట్ల తోపాటు రాష్ట్ర ప్రభుత్వ వెబ్సైట్లోనూ ప్రచురించాలని ఆదేశించింది.
కేంద్రం నుంచి ఆర్థిక సాయం కోరేందుకు అవసరమైన వివరాలతో ఏడు రోజుల్లో మెమోరాండం సిద్ధం చేయాలని ప్రణాళిక శాఖను ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ రుణాల పున



ర్వ్యవస్థీకరణ, రుణ వసూళ్లలో బలవంతపు చర్యలు నివారించే అంశాలపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో సంప్రదించాలని కలెక్టర్లకు సూచించింది. కరువు ప్రకటన జారీ చేసిన తేదీ నుంచి ఆరు నెలలపాటు అమల్లో ఉంటుంది. అంతకుముందే ఉపసంహరించకపోతే ఈ గడువు కొనసాగుతుంది. జాబితాలో లేని మండలాల్లో పరిస్థితులను రాష్ట్ర కరువు పర్యవేక్షణ కేంద్రం పరిశీలిస్తుందని, అవసరమైతే అదనపు నోటిఫికేషన్ ద్వారా మరిన్ని మండలాలను చేర్చవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.

జిల్లాల వారీగా కరువు ప్రభావిత మండలాల సంఖ్య ఇలా ఉంది:

ఆదిలాబాద్ 20, భద్రాద్రి కొత్తగూడెం 16, హనుమకొండ 14, జగిత్యాల 3, జనగాం 4, జయశంకర్ భూపాలపల్లి 5, జోగులాంబ గద్వాల 13, కామారెడ్డి 4, కరీంనగర్ 3, ఖమ్మం 17, కుమురం భీం ఆసిఫాబాద్ 5, మహబూబాబాద్ 7, మహబూబ్నగర్ 13, మంచిర్యాల 11, మెదక్ 1, మేడ్చల్మల్కాజిగిరి 9, ములుగు 4, నాగర్కర్నూల్ 13, నల్గొండ 28, నారాయణపేట 13, నిర్మల్ 9, నిజామాబాద్ 18, రాజన్న సిరిసిల్ల 2, రంగారెడ్డి 18, సంగారెడ్డి 28, సిద్దిపేట 8, సూర్యాపేట 23, వికారాబాద్ 20, వనపర్తి 11, వరంగల్ 8, యాదాద్రి భువనగిరి 17.
మొత్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేరాయి.

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడు అఖిలపక్షం

- భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం
- వర్షపాతం లోటు, తాగునీరు, సాగునీరు మరియు విద్యుత్ సరఫరాపై ప్రధాన చర్చ
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రాజకీయ పార్టీల నుంచి సలహాల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 27 :

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరుతోంది.

ఆరోగ్యమే విలువైన సంపద

కనక్కూర్, అక్టోబర్ 27 :

ఆరోగ్యమే మానవ జీవితంలో అత్యంత విలువైన సంపద అని, భారతీయ ఆయుర్వేద వారసత్వాన్ని పరిరక్షిస్తూ శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేరళంలోని కనక్కూర్ శ్రీ ధన్వంతరి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ధన్వంతరి మహాయాగానికి హాజరైన ఆయన ఆరోగ్య పరిరక్షణ, ఆయుర్వేద ప్రాధాన్యత, ప్రజారోగ్యం, సామాజిక బాధ్యతలపై ప్రసంగించారు. ఆరోగ్యం అంటే వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ స్థిరత్వం, సంతృప్తికరమైన జీవితం కూడా అందులో భాగమేనని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. ధన్తేరస్‌ను బంగారం కొనుగోలు చేసే పర్వదినంగానే కాక ధన్వంతరి జయంతిగా దాని అసలైన ప్రాముఖ్యతతో గుర్తించాలన్నారు. పాల సముద్ర మథనంలో అమృత కలశంతో ఆవిర్భవించిన దేవతల వైద్యుడు భగవాన్ ధన్వంతరి ఆరోగ్యం, జీవరక్షణకు ప్రతీకగా నిలుస్తారని భట్టి పేర్కొన్నారు. ధన్వంతరిని ఆరాధించడం వ్యక్తిగత ఆరోగ్యానికే కాక కుటుంబ, సమాజ శ్రేయస్సుకు కూడా ప్రతీక అని వివరించారు.

ఆయుర్వేదంలో కేరళం ప్రత్యేకం

భారతీయ వైద్య వారసత్వంలో ఆయుర్వేదానికి విశిష్ట స్థానం ఉందని, ఔషధ మొక్కలపై సంప్రదాయ పరిజ్ఞానం, ప్రత్యేక చికిత్సా విధానాలతో కేరళం దేశవిదేశాల్లో గుర్తింపు పొందిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఆలయంలో 11 రోజులపాటు నిర్వహిస్తున్న ధన్వంతరి మహాయాగం ఆరోగ్య ప్రాధాన్యతను, భారతీయ వైద్య సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దోహదపడుతుందని అన్నారు. వ్యాధుల చికిత్సతోపాటు నివారణ, సమతుల్యమైన జీవనశైలి, సరైన ఆహారం, ప్రకృతితో సామరస్యంగా జీవించడం వంటి అంశాలకు సంప్రదాయ వైద్య విధానాలు ప్రాధాన్యత నిచ్చాయని గుర్తు చేశారు. అయితే ఆయుర్వేదాన్ని ఆచరిస్తూ శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించాలని, రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

ప్రజారోగ్యమే అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం అభివృద్ధి విధానాల్లో ప్రధానంగా ఉండాలన్నారు. హాస్పిటల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విద్య, పరిశోధన, వ్యాధుల నివారణ, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలకు నిరంతర పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీనవర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య కార్యకర్తల సేవలను గౌరవించాలని సూచించారు. మన్నత్తు పద్మనాభన్, శ్రీ నారాయణ గురు, అయ్యంకాళి వంటి సామాజిక సంస్కర్తలు సమాజంలో జ్ఞానాన్ని విస్తరించేందుకు, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేశారని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. నాయర్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూనే యువతలో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఆరోగ్యం పర్యావరణంతో ముడిపడి ఉందని, అడవులు, ఔషధ మొక్కలు, స్వచ్ఛమైన నీరు, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం భావితరాల శ్రేయస్సుకు అవసరమని అన్నారు. దేశంలో శాంతి, సమాజంలో సామరస్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ధన్వంతరి మహాయాగ నిర్వాహకులు, ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, మొదటగా విచ్చేసిన భక్తులందరికీ డిప్యూటీ సీఎం మలయాళంలో శుభాకాంక్షలు తెలిపారు.

సివిల్ వివాదంలో లంచం బాగోతం

- రూ.10 లక్షలు డిమాండ్.. రూ.6 లక్షలకు బేరం
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ దాడి
- మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పట్టివేత
- పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, అక్టోబర్ 27:

సివిల్ వివాదాన్ని పరిష్కరిస్తామంటూ లంచం డిమాండ్ చేసిన మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు, ఓ కానిస్టేబుల్ ఏసీబీ వలకు చిక్కారు. బాధితుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది.
పోలీసు వర్గాలు, ఏసీబీ వివరాల ప్రకారం.. పాతబస్తీ పరిధిలోని ఓ స్థలానికి సంబంధించి తలెత్తిన సివిల్ వివాదంలో ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావు జోక్యం చేసుకున్నారు. సమస్యను అనుకూలంగా పరిష్కరిస్తానంటూ బాధితుడి నుంచి తొలుత రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అంత మొత్తం చెల్లించలేనని బాధితుడు చెప్పడంతో చివరకు రూ.6 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.3 లక్షలు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరినట్లు సమాచారం. లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం మీర్‌చౌక్ పరిధిలోని ఓ దుకాణంలో రూ.3 లక్షల నగదును అందిస్తుండగా అధికారులు దాడి చేశారు. నగదు స్వీకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కొండల్‌రావుతో పాటు ఈ వ్యవహారంతో సంబంధమున్న కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు.
అనంతరం మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. కేసు నమోదు చేసిన అధికారులు, నిందితులను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.



కాంగ్రెస్ పాలనలో చస్తేనే పనులవుతాయా?

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన రాష్ట్రవ్యాప్త రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీలర్ల సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజును గత 25 ఏళ్లుగా చూస్తున్నా. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి సునీతా లక్ష్మారెడ్డిని, పద్మా దేవేందర్ రెడ్డిని, ఇప్పుడు గూడెం మహిపాల్ రెడ్డిని గౌరవ అధ్యక్షుడిగా పెట్టుకుని డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఎవరిని ఎలా ఒప్పించాలో తెలిసిన నేర్పరి. అయితే ఈరోజు వేదిక మీద రాజు మాట్లాడుతూ డీలర్ల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా, ప్రాణత్యాగానికైనా సిద్ధం అనడం తనను కదిలించిందన్నారు. నిన్ననే జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే, డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు అనిరుధ్ రెడ్డి కూడా మంత్రుల నియోజకవర్గాలకే నిధులు పోతున్నాయి, జడ్చర్ల లో రోడ్లు పగుళ్లు పడ్డా రూ.3040 కోట్ల బిల్లులు రావడం లేదు, ఒక కాంట్రాక్టర్ చనిపోతేనే రూ.5 కోట్ల బిల్లు పడింది, నేను చచ్చిపోతేనే మా నియోజకవర్గ బిల్లులు వస్తాయంటే ప్రాణత్యాగానికి సిద్ధం అని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెల్లారే హామీలు అమలు చేయమని డీలర్లు అడగలేదు. కొత్త ప్రభుత్వం కుదురుకోవడానికి ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు ఓపికగా ఎదురుచూశారు. కానీ మూడేళ్లు గడిచినా డీలర్ల వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడన్నారు. కనీసం సివిల్ సప్లైస్ కమిషనర్ గానీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని అధ్యక్షుడు రాజు బాధపడుతున్నారు. రేవంత్ రెడ్డి తమది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటారు. ప్రజలను ఎప్పుడైనా కలిసేదే ప్రజా ప్రభుత్వం కదా! మరి 17,200 మంది రేషన్ డీలర్లు ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడికే మూడేళ్లలో అపాయింట్మెంట్ దొరకకపోతే ఇదెక్కడి ప్రజాపాలన అని ప్రశ్నించారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజు, నందయ్య తదితరులు వస్తే సచివాలయంలో రెండు రోజులపాటు కూర్చోబెట్టి భోజనం పెట్టి నాటి మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి అధికారులను, కేసీఆర్ ను మొప్పించి కమిషన్ను రూ. 140 కి పెంచారు. ఆ రోజు బయట ప్రెస్ మీట్ పెట్టిన ఇదే ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.140 ఏం చాలుతాయి, కనీసం రూ.300 ఇవ్వాలి అని మాట్లాడారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఒక్కో డీలర్ వందలాది ఓట్లు వేయిస్తాడని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు నందయ్య, జీవన్ రెడ్డి వెళ్లి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబుకు చెప్పి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టించారు. నెలకు రూ.5,000 గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమీషన్, రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చి అన్ని వస్తువులు అమ్ముకునే అనుమతి ఇస్తామని నమ్మబలికారు.ఆ మాటలు నమ్మి డీలర్లందరూ కాంగ్రెస్‌కు పనిచేసి, ఓట్లు వేయించి గెలిపించారు.ఇవాళ డీలర్లు కొత్త డిమాండ్లేమీ పెట్టడం లేదు.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆ మూడు హామీలనే అమలు చేయమని అడుగుతున్నారు.చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని కేసీఆర్కొ ట్లాడి తెలంగాణ సాధించిన గజ్వేల్ గడ్డ మీద సమావేశం పెడితేనే ప్రభుత్వ పెద్దలకు సురుకు తగిలి కదలిక వస్తుందని ఇక్కడి నుంచే డీలర్లు సమరశంఖం పూరించారు.పేద ప్రజలందరికీ కడుపునిండా అన్నం పెడుతున్న రేషన్ డీలర్ల కడుపు మాత్రం కాంగ్రెస్ పాలనలో ఎండిపోతోంది.నాడు కేసీఆర్ పేదవాడు కడుపు నిండా తినాలని మనిషికి 4 కిలోల బియ్యాన్ని 6 కిలోలకు పెంచి, కార్డుకు 20 కిలోల సీలింగ్ ఎత్తేశారు. ఇంట్లో 10 మంది ఉంటే 60 కిలోల బియ్యం ఇచ్చారు.ఇవాళ డీలర్లకు రూపాయి కమిషన్ పెరగలేదు గానీ, నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి.మంచినూనె రూ. 210, కందిపప్పు రూ. 175, పెసరపప్పు రూ. 130, ఉల్లిగడ్డ రూ. 60 కి చేరింది, ఎల్లి గడ్డ ధర కొండెక్కింది. పన్నులు, అధికారుల వేధింపులు పెరిగిపోయి డీలర్లు కుటుంబాలను వెళ్లదీయలేని దుస్థితి నెలకొంది.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాఖ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో చెప్పడానికి దొడ్డు బియ్యం వ్యవహారమే నిదర్శనమన్నారు. సన్న బియ్యం పంపిణీ మొదలుపెట్టాక, చిన్నగా ఉండే రేషన్ షాపుల్లో జాగా లేకపోయినా మూడు నెలల బియ్యం ఒకేసారి నిల్వ చేసి ఇవ్వమంటున్నారు.మరోవైపు గత 16, 17 నెలలుగా పాత దొడ్డు బియ్యం నిల్వలను అలాగే వదిలేశారు. గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లలో లక్ష మెట్రిక్ టన్నులు, రేషన్ షాపుల్లో 40 నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మూలుగుతోంది. దీని విలువ అక్షరాలా రూ. 600 కోట్లు! 16 నెలలుగా ఆ బియ్యం ముక్కిపోయి, ఎర్ర పురుగులు, లక్క పురుగులు పట్టి, ఎలుకలు, పందికొక్కులు తిని పిండిగా మారిపోయింది. సిద్దిపేటలో ఒక రేషన్ షాపుకు వెళ్లి చూస్తే పురుగులు బయటకు పారుతున్నాయి.ఆ పాడైపోయిన బియ్యాన్ని మనుషులే కాదు, బయట పారబోస్తే తిన్న పశువులు, కుక్కలు కూడా విషతుల్యమై చచ్చిపోయే పరిస్థితి వచ్చింది.మిలిటరీలో పనిచేశానని గొప్పలు చెప్పుకునే మంత్రికి, 16 నెలల క్రితమే ఆ బియ్యాన్ని వేలం వేసి అమ్మే కనీస తెలివి లేదా? ఆ బియ్యాన్ని అమ్మితే వచ్చే రూ. 600 కోట్లతోనే డీలర్ల కమిషన్ పెంపు, గౌరవ వేతనం ఇచ్చేయవచ్చు కదా!తమ నిర్లక్ష్యంతో రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని పందికొక్కుల పాలు చేయడమే కాకుండా.. ఇప్పుడు టెండర్లు పిలిచి 16 నెలల క్రితం షాపులో ఉన్న స్టాక్ లెక్క ప్రకారం తూకం వేసి ఇవ్వాలని డీలర్లను వేధిస్తున్నారు.అసలే ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకం తక్కువ వస్తుంటే, ఏడాదిన్నరగా ఎలుకలు, పురుగులు తిని తగ్గిన 5, 6 క్వింటాళ్ల తరుగును కూడా డీలర్లే జేబులోంచి కట్టాలనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.
కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల సివిల్ సప్లైస్ కార్పొరేషన్ నేడు దాదాపు రూ. లక్ష కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది.
సన్న బియ్యం నిధులు, సన్న వడ్ల బోనస్ డబ్బులు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా కార్పొరేషన్‌కు విడుదల చేయకుండా కార్పొరేషన్‌నే అప్పులు తెచ్చుకోమంటోంది.గ్రామాల్లో మహిళలకు గ్యాస్ సబ్సిడీ ఒక నెల వేస్తే మూడు నెలలు ఎగ్గొడుతున్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ బలంగా ఉంటేనే డీలర్లు బతుకుతారు, కార్పొరేషన్ దివాలా తీస్తే డీలర్లు కూడా ఆగమవుతారు.డీలర్లకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవా అంటే అదీ కాదు. రూ.లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ, రూ. లక్ష కోట్లతో ఫ్యూచర్ సిటీ, రూ. 30 వేల కోట్లతో రోడ్లు అంటున్నారు. అందాల పోటీలకు, ఫుట్‌బాల్ షోకులకు నిధులుంటాయి. నాడు కేసీఆర్ గారు క్యాంప్ ఆఫీస్ కడితే విమర్శించిన రేవంత్ రెడ్డి నేడు రూ.100 కోట్లతో కొత్త క్యాంప్ ఆఫీస్ కట్టుకున్నారు. మరి రాష్ట్రంలోని 17,200 మంది డీలర్లకు నెలకు రూ. 5,000 గౌరవ వేతనం ఇస్తే అయ్యే ఖర్చు నెలకు రూ.10 కోట్లు కూడా కాదు. పేదల ఆకలి తీర్చే డీలర్లకు నెలకు రూ. 10 కోట్లు ఇవ్వడానికి మనసు రావడం లేదా? తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి డీలర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని చర్చలకు పిలవాలి. డీలర్లపై వేధింపులు ఆపి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.5,000 గౌరవ వేతనం, రూ.300 కమీషన్, మినీ సూపర్ మార్కెట్ల హామీలను వెంటనే అమలు చేయాలి. డీలర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉండి అసెంబ్లీలో, మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే కరువు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రిని ఎప్పుడు చేసుకుందామా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారన్నారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి సదుపాయాలు అందించామని కేటీఆర్ గుర్తు చేశారు. రైతుబంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలిచామన్నారు. కరోనా సంక్షోభ సమయంలోనూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆదుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు వాటి అమలుపై ప్రశ్నిస్తే తప్పించుకునే ధోరణిలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయలేకపోతే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాలని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. మూడు నెలల్లోనే అన్నీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కరువు పరిస్థితులు ప్రకృతి వల్ల మాత్రమే ఏర్పడినవి కావని, నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని కేటీఆర్ ఆరోపించారు. జూన్ 19న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించినప్పుడు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే భయంతోనే బటన్ నొక్కడం లేదని ఆరోపించారు. దేవుడు ప్రజల కోసం నీళ్లు పంపిస్తే మధ్యలో పూజారి రేవంత్ రెడ్డి అడ్డుపడి బటన్ నొక్కలేదని వ్యాఖ్యానించారు. గోదావరి నుంచి 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ నీటిని వినియోగించుకుని ఉంటే కోటి ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదన్నారు. ఒకవైపు పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు సకాలంలో అందడం లేదని, కరెంటు, యూరియా, సాగునీటి సమస్యలు మరింత తీవ్రంగా మారాయని విమర్శించారు. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. నెలనెలా దిల్లీకి వెళ్లి ఈఎంఐ కట్టడానికే ఉన్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని వ్యాఖ్యానించారు. రైతులకు రైతుబంధు పడకపోయినా రాహుల్ బంధు మాత్రం సమయానికి అందుతోందని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి దోపిడీ వేదికగా మారిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. దిల్లీలో బీజేపీ ప్రజలను విభజించడంలో బిజీగా ఉంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉందని వ్యాఖ్యానించారు.

ఇక్కడ గెలిచిన వారు నియోజకవర్గానికి ఏమి సాధించారు

నిర్మల్‌లో బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గొడం నగేష్ గెలిచినా నియోజకవర్గానికి ఏమి సాధించారని ప్రశ్నించారు. నిర్మల్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ, చెక్‌డ్యామ్‌లు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి అధికారం కోల్పోగానే పార్టీని వీడారని విమర్శించారు. అవకాశవాదులు పార్టీని వీడినా పోరాటవాదులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తెలంగాణను ప్రస్తుత సంక్షోభం నుంచి బయట పడేయాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ మళ్లీ గట్టెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కువ సమయం లేదని, మరో ఏడాదిలో రాజకీయ పరిస్థితులు మారుతాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మళ్లీ అభివృద్ధి, సంక్షేమ బాటలోకి వస్తుందని అన్నారు. నిర్మల్‌లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామచరణ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని, యువ నాయకులు అనిల్ జాదవ్, జాన్సన్ రాథోడ్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన బాధ్యతలు అప్పగించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

550 దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు

హైదరాబాద్, అక్టోబర్ 27 :

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా 550కిపైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ కమిటీల ద్వారా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై సచివాలయంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా ఈనెల 29న దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందన్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో సమ్మిట్ 2026పై రోడ్‌షోలను నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం

గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పంపామని, ఆహ్వాన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

సమ్మిట్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

సమ్మిట్ జరిగే ప్రధాన వేదికను 25 సెక్టార్లుగా విభజించి ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చలు, ఒప్పందాల కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, వివిధ కంపెనీలు, సంస్థల ప్రదర్శనలకు అవసరమైన వసతులను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతోపాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబర్ 27:

ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యే సీఈఓలు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమ్మిట్ సన్నాహాలపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నవంబర్ మొదటి వారంలోగా కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

ఈ నెల 29న ఢిల్లీలో నిర్వహించనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎం సూచించారు. టెక్నాలజీ, ఫార్మా, ఏరోస్పేస్ తదితర రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేసేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్లైమేట్ ఛేంజ్, కృత్రిమ మేధ (ఏఐ) రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులను సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ కార్యక్రమాలు, ఔత్సాహిక పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశాల నిర్వహణపైనా సమీక్షించారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగానికి సంబంధించి చేపడుతున్న ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు వివరించారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ సంప్రదాయాలు, చారిత్రక వైభవం ప్రతిబింబించేలా డిజైన్లు రూపొందించాలని సీఎం సూచించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విదేశీ అతిథులకు పరిచయం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి.అనుదీప్ పాల్గొన్నారు.

తీరు మారకుంటే కఠిన చర్యలే

- **భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించను**
- **సర్వేను పరిశీలించి భూమి విస్తీర్ణంపై రైతులకు స్పష్టత ఇవ్వాలి**
- **పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి**
- **రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి**

సంగారెడ్డి/హైదరాబాద్, :


రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తి స్థాయి ఫలితాలు కనిపించలేదని, భవిష్యత్తులో మార్పు రాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి మంగళవారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేస్తున్నారు, సర్వే పూర్తికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు



మంత్రి చెప్పారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదకుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీలు రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతోపాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల



ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

- **మానవ హక్కుల వేదిక డిమాండ్**

హైదరాబాద్, అక్టోబర్ 27 :

రాష్ట్రంలో తీవ్రమవుతున్న నీటి సంక్షోభం, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డేటా సెంటర్ల వల్ల తాగునీరు, వ్యవసాయం, పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగదని పారదర్శకమైన అధ్యయనాలు నిర్ధారించే వరకు కొత్త హామీలను నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక ప్రతినిధులు వి.ఎస్.కృష్ణ, ఎస్.జీవన్ కుమార్‌లు తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తీవ్ర నీటి కొరత ఉందని, రైతులు ఒక పంట కాలాన్ని వాయిదా వేసుకోవాలని, తాగునీటి సరఫరాకు హామీ ఇవ్వడం కూడా కష్టంగా ఉందని స్వయంగా ముఖ్యమంత్రి హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) నీటి అత్యవసర పరిస్థితిని ప్రకటించిందని, ఇలాంటి తరుణంలో భారీగా నీటిని వినియోగించే ఏఐ డేటా సెంటర్లను ప్రోత్సహించడం తీవ్ర వైరుధ్యంతో కూడుకున్న నిర్ణయమని వారు తెలిపారు. డేటా సెంటర్లలోని ప్రాసెసర్లను చల్లబరిచేందుకు అత్యాధునిక శీతలీకరణ వ్యవస్థలు అవసరమని, వీటి వినియోగానికి లక్షలాది లీటర్ల నీరు అవసరమవుతుందని తెలిపారు. 2029 నాటికి 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కోసం గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి పడుతుందని, దీనివల్ల గృహాలు, వ్యవసాయ రంగానికి విద్యుత్ కోతలు తప్పవని హెచ్చరించారు. భారీ మూలధనంతో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టుల ద్వారా వచ్చే శాశ్వత ఉపాధి అవకాశాలు చాలా తక్కువ అని, కార్పొరేట్ సంస్థల విస్తరణ కోసం విలువైన ప్రకృతి వనరులను కేటాయించడం వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని చివరికి స్థానిక ప్రజలే భరించాల్సి వస్తుందని తెలిపారు. కాగా, ప్రతిపాదిత, ఉన్న అన్ని డేటా సెంటర్ల వనరుల వినియోగంపై పారదర్శకమైన, స్వతంత్ర అధ్యయనాలు నిర్వహించాలని హెచ్ఆర్ఎఫ్ కోరింది. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి నీరు, విద్యుత్ వినియోగంపై కచ్చితమైన పరిమితులు విధించాలన్నది. సాంకేతిక రంగానికి పీఆర్ ప్రతిష్ఠ కంటే ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, వ్యవసాయానికే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మహిళపై లైంగిక దాడి

రంగారెడ్డి, అక్టోబర్ 27:

మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను రిసార్ట్స్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ తెలిపిన మేరకు.. మల్లాపూర్‌కు చెందిన ఓ మహిళ (30) భర్తతో విడిపోయి టైలరింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన జగన్‌మోహన్ మోత్కూరు మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

ఇతడితో మహిళకు 4 నెలల క్రితం ఫోన్ ద్వారా పరిచయం ఏర్పడింది. తాను భువనగిరి మేనేజర్‌గా పని చేస్తానని, రూ.5 లక్షలు ఇస్తే మున్సిపల్ ఆఫీసులో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె సోమవారం రూ.4.5 లక్షలు సిద్ధం చేసుకోగా, జగన్‌మోహన్ కారులో వెళ్లి మల్లాపూర్‌లో ఎక్కించుకుని భువనగిరికి బయలుదేరారు. ప్రయాణించే సమయంలోనే డబ్బు తీసుకొని కారులో భద్రపరుచుకున్నాడు. భువనగిరికి వెళ్లకుండా ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ వద్ద శ్రీనిధి రిసార్ట్స్‌లోకి కారును మళ్లించగా బాధితురాలు అనుమానంతో ప్రశ్నించింది. డబ్బులు తీసుకునే అధికారి రిసార్ట్స్‌లో ఉన్నాడని బదులిచ్చాడు. లోపలికి వెళ్లిన అనంతరం రిసార్ట్స్‌లోని ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అధికారిని కలుద్దామని ఆమె కోరడంతో కారులో ఎక్కించుకుని ఆమె ముఖంపై చేతులతో దాడి చేసి బయటకు తోసేసి వెళ్లిపోయాడు. బాధితురాలు 100కు డయల్ చేయగా ఘట్‌కేసర్ పోలీసులు వచ్చి భరోసా కేంద్రానికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగన్‌మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై పోరు

హైదరాబాద్, అక్టోబర్ 27 :

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల పక్షాన నిలిచి, యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ చేపట్టిన చలో జవహర్‌నగర్ మహా పాదయాత్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. మంగళవారం ఉదయం ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద ప్రారంభమైన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రజా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టిన ఈటలను అభినందించారు. గతంలో కొంపల్లి మోహన్ రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు వేసినప్పుడు డంపింగ్ యార్డును తరలించడంతోపాటు శాస్త్రీయంగా క్యాపింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ ప్రక్రియ ఏమైందో, నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక చెర్యాల, ఎదులాబాద్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, దుర్గంధం వల్ల ప్రజలు అక్కడ నివసించలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని, భూగర్భ జలాలు విషతుల్యమైన కారణంగా ఎదులాబాద్ చెరువులోని చేపలను మార్కెట్‌లో ఎవరూ కొనుగోలు చేయని దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య ప్రభావం స్థానికంగానే కాక జూబ్లీహిల్స్, తార్నాక, ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు వ్యాపిస్తోందని తెలిపారు. దిల్లీలోని ఓఖ్లా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను తాను పరిశీలించిన సందర్భాన్నిప్రస్తావిస్తూ అక్కడ పారిశ్రామిక ప్రాంతమైనప్పటికీ నియమని బంధనలకు లోబడి రాత్రివేళల్లో మాత్రమే వ్యర్థాలను తరలిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని, పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా నిర్వహిస్తున్నారని తెలిపారు. కానీ జవహర్‌నగర్ విషయంలో కనీస నిబంధనలు కూడా పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. ఈ సమస్య తీవ్రతపై ఎంపీ ఈటల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసి నెల రోజులు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడం వల్లే ఇది ఉద్యమ రూపం దాల్చిందని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డును పూర్తిగా మూసివేసి శాశ్వతంగా తరలించే వరకు ఈ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, విచ్ఛిన్నకర విధానాలను ఎండగడుతూ 'సర'పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలలో చైతన్యం కలిగించేందుకు నవంబర్ 2న ట్యాంక్ బండ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా పాదయాత్రకు ప్రజలు, శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులందరూ చురుగ్గా ముందుకు తీసుకెళ్లాలని రామచందర్ రావు సూచించారు.

సాంకేతిక ఆవిష్కరణల్లో భారత్‌దే నాయకత్వం

- అనుసరించే స్థాయి నుంచి సృష్టించే స్థాయికి
- యువ ఆవిష్కర్తల ఆత్మవిశ్వాసంపై మోదీ ప్రశంసలు
- ప్రపంచ సమస్యలకు స్వదేశీ పరిష్కారాలు
- 2.5 లక్షలకు చేరిన స్టార్టప్‌లు.. ఇన్నోవేషన్ సూచీలో మెరుగైన ర్యాంకు



న్యూఢిల్లీ, అక్టోబర్ 27:


సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచానికి దిశా నిర్దేశం చేసే స్థాయికి భారత్ ఎదగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఇతర దేశాలు అభివృద్ధి చేసిన సాంకేతికతను స్వీకరించే స్థాయి నుంచి ప్రపంచ సమస్యలకు సొంతంగా పరిష్కారాలు చూపించే స్థాయికి దేశం చేరుకుందని పేర్కొన్నారు. కొత్త సాంకేతికతల అభివృద్ధిలో భారత శాస్త్రవేత్తలు, యువ ఆవిష్కర్తలు మరింత చొరవ చూపాలని పిలుపునిచ్చారు. దిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం నిర్వహించిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్క్లేవ్-2026 (ఈఎస్‌టీఐసీ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, కొత్త ఆలోచనలు దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో మార్పునకు నిదర్శనమని ప్రశంసించారు.

గతంలో ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు జరిగిన తర్వాత వాటిని భారత్ స్వీకరించేందుకు చాలా సమయం పట్టేదని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, సాంకేతికతను ఉపయోగించుకోవడమే కాకుండా కొత్త ఆవిష్కరణలు చేపట్టి అంతర్జాతీయ సవాళ్లకు పరిష్కారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలోనే అంగారకుడి కక్ష్యకు చేరుకోవడం, చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా అడుగుపెట్టడం భారత శాస్త్ర సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమన్నారు. కొవిడ్ సమయంలో స్వదేశీ టీకాలను అభివృద్ధి చేసి విస్తృతంగా పంపిణీ చేయడంతో పాటు, అవసరమైన ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆవిష్కరణల్లో భారత్ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. ఇతర దేశాలను అనుసరించే స్థాయి నుంచి అంతర్జాతీయ పరిశోధనలు, సాంకేతిక పరిష్కారాల రూపకల్పనలో భాగస్వామ్యం వహించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. ప్రపంచ వేదికపై కొత్త ఆవిష్కరణలను సంయుక్తంగా సృష్టించే దేశంగా భారత్ రూపాంతరం చెందుతోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భారత శాస్త్రవేత్తల్లో ప్రతిభ, కృషి ఉన్నప్పటికీ వారి సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు అవసరమైన వనరులు, వ్యవస్థలు తగినంతగా లేవన్నారు. 2014 తర్వాత పరిశోధనలు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం పలు విధానపరమైన చర్యలు తీసుకుందని వివరించారు. అంతరిక్షం, అణుశక్తి రంగాల్లో ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించడం, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు పరిశోధనా వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని జితేంద్ర సింగ్ తెలిపారు. గగన్‌యాన్, డీప్ ఓషన్ మిషన్, డిజిటల్ ఇండియా, బయోటెక్నాలజీ, స్టార్టప్‌ల అభివృద్ధి, స్వదేశీ కరోనా టీకా తయారీ వంటి కార్యక్రమాలు దేశ సామర్థ్యాన్ని చాటుతున్నాయని చెప్పారు.

దేశంలో స్టార్టప్‌ల సంఖ్య ఒకప్పుడు 350గా ఉండగా ప్రస్తుతం 2.5 లక్షలకు పెరిగిందని మంత్రి వెల్లడించారు. అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 9 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని తెలిపారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ ర్యాంకు 80 నుంచి 38కి మెరుగుపడిందని పేర్కొన్నారు. పరిశోధనలకు ప్రోత్సాహం, స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, యువ ఆవిష్కర్తలకు అవకాశాల కల్పనతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెళ్లి పేరుతో నమ్మించి.. నరకం చూపించాడు!

- భర్తతో పాటు ముగ్గురు స్నేహితులపై అత్యాచారం ఆరోపణలు
- ఇంట్లో బంధించి అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఫిర్యాదు
- అద్దె కోసం వచ్చిన ఇంటి యజమానితో వెలుగులోకి ఘటన
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు



హైదరాబాద్, అక్టోబర్ 27:

పెళ్లి చేసుకుంటానని నమ్మించి భారత్‌కు తీసుకొచ్చిన యువతిని, వివాహం తర్వాత భర్తే తన స్నేహితులతో కలిసి వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. మయన్మార్‌కు చెందిన 18 ఏళ్ల వివాహితను ఇంట్లో నిర్బంధించి, ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అక్టోబర్ 23న బకాయి అద్దె వసూలు చేసేందుకు వచ్చిన ఇంటి యజమాని తాళం పగులగొట్టి లోపలికి వెళ్లడంతో ఈ ఘటన బయటపడింది. బాధితురాలు హుమైరా తమన్నా ఫిర్యాదు ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌లో నివసిస్తున్న సమయంలో మహమ్మద్ ఫయాజ్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతడు, మే నెలలో కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమెను భారత్‌కు తీసుకొచ్చాడు. హైదరాబాద్‌కు చేరుకున్న మూడు, నాలుగు రోజుల్లోనే ఇద్దరూ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత ఫయాజ్ మయన్మార్‌కు చెందిన తన ముగ్గురు స్నేహితులు అహ్మద్ ముజీబ్, నూర్ కమల్, జియాఉర్‌రెహమాన్‌లను ఇంటికి తీసుకొచ్చాడు. ఆ తర్వాత నుంచి తనను ఇంట్లోనే నిర్బంధించి, ఫయాజ్ బయటకు వెళ్లేటప్పుడు తాళం వేసి తన స్నేహితులను లోపలికి పంపేవాడని బాధితురాలు ఆరోపించింది. వారు తనపై అత్యాచారానికి పాల్పడేవారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని వారిలో ఇద్దరు బెదిరించారని తెలిపింది. భాష తెలియకపోవడం, సహాయం కోసం ఎవరిని సంప్రదించాలో అర్థంకాకపోవడం, నిందితుల బెదిరింపుల కారణంగా ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయినట్లు వివరించింది. అక్టోబర్ 23న బకాయి అద్దె కోసం వచ్చిన ఇంటి యజమాని బయట నుంచి తాళం వేసి ఉండటాన్ని గమనించి దాన్ని పగులగొట్టి లోపలికి వెళ్లడంతో బాధితురాలు బయటపడింది. అనంతరం మరో వ్యక్తి మొబైల్ ఫోన్ సాయంతో బంగ్లాదేశ్‌లోని తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారి ద్వారా హైదరాబాద్‌లోని బంధువులకు విషయం తెలియడంతో బాధితురాలిని వారి ఇంటికి తీసుకెళ్లారు. అక్టోబర్ 26న బాధితురాలి బంధువు మహమ్మద్ రషీద్ ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. దీంతో భర్త మహమ్మద్ ఫయాజ్‌తో పాటు అతడి ముగ్గురు స్నేహితులపై అత్యాచారం, అక్రమ నిర్బంధం, క్రిమినల్ బెదిరింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలకు విక్రయం
- రూ.15 డ్రిప్ లైన్ ధర రూ.250
- ఎన్‌పీపీఏ పనితీరుపై ధర్మాసనం అసంతృప్తి
- రోగుల ప్రయోజ్యాల కంటే వ్యాపారాలకే ప్రాధాన్యమా?



న్యూఢిల్లీ, అక్టోబర్ 27:

ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), రిటైలర్లు కొనుగోలు చేసే ధర మధ్య భారీ వ్యత్యాసాలు ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఔషధ తయారీ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవస్థ పనిచేయడంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. మందుల ధరలను నియంత్రించాల్సిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) పనితీరు కూడా నిర్వీర్యమైన సంస్థను తలపిస్తోందని వ్యాఖ్యానించింది. మందుల ధరల నియంత్రణకు సంబంధించిన రెండు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

రూ.11 వేలకే లభించే ఔషధాన్ని రూ.1.30 లక్షలకు విక్రయించడాన్ని ధరల సర్దుబాటుగా ఎలా సమర్థించుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. రిటైలర్లు రూ.15కు కొనుగోలు చేసే డ్రిప్ లైన్‌ను రూ.250కు విక్రయిస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. ఇంత భారీ వ్యత్యాసాలు కొనసాగుతున్నప్పుడు ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు (డీపీసీవో) లక్ష్యం ఏమిటని నిలదీసింది. ధరల పెరుగుదలపై కేంద్రం ఇస్తున్న వివరణలు సంతృప్తికరంగా లేవని అభిప్రాయపడింది.

దేశంలో మందుల ధరలు ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉన్నాయని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తలసరి ఆదాయం తక్కువగా ఉన్న దేశంలో అంతర్జాతీయ ధరలతో పోల్చడం ద్వారా మందులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. రోగుల అవసరాల కంటే వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వడం సరికాదని పేర్కొంది.

ప్రైవేటు ఆసుపత్రుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఆసుపత్రుల నిర్వహణకు నిరంతర మౌలిక సదుపాయాలు అవసరమని, బయట కొనుగోలు చేసే మందుల్లో నకిలీవి ఉండే ప్రమాదం ఉందని తెలిపారు. అయితే, ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. వైద్య సేవలకు రుసుములు వసూలు చేయవచ్చని, కానీ మందుల కొనుగోలు ధరపై 100 నుంచి 200 రెట్లు అధికంగా వసూలు చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించింది. నిర్వహణ ఖర్చుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలే తప్ప, మందుల ధరల పెంపుతో రోగులపై భారం మోపకూడదని స్పష్టం చేసింది.

డీపీసీవో-2013 ప్రకారం షెడ్యూల్డ్ ఔషధాలపై ధరల పరిమితులు ఉన్నప్పటికీ, షెడ్యూల్‌లో లేని మందుల ప్రారంభ ధరలపై తగిన నియంత్రణ లేదని పిటిషనర్ కిషన్ చంద్ర జైన్ కోర్టుకు తెలిపారు. దేశంలో సుమారు 82 శాతం మందులు షెడ్యూల్ పరిధిలోకి రావని, వాటి ప్రారంభ ధరలను ముందుగానే నియంత్రించే విధానం లేకపోవడంతో తయారీ సంస్థలకు ఎంఆర్‌పీ నిర్ణయంలో అధిక స్వేచ్ఛ లభిస్తోందని వివరించారు.

క్యాన్సర్ ఔషధాల ధరల అంశంపైనా గతంలో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. అక్టోబర్ 12న జరిగిన విచారణలో క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయడంపై కేంద్రం ఇచ్చిన వివరణపట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పరిమితిని ఇతర ఔషధాలకూ ఎందుకు వర్తింపజేయలేదని నిలదీసింది. క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం ద్వారా రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్లు ఆదా అవుతాయని కేంద్రం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఔషధ ధరల నియంత్రణ, రోగులకు అందుబాటు ధరల్లో మందుల లభ్యత అంశాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఓటు చోరీపై రాహుల్ గాంధీ ధ్వజం

- దిల్లీలో ప్రజా విచారణ
- నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 416 పేర్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వరకు పోరాటం
- 30న ప్రజా అభిశంసనకు అనుమతిపై వివాదం
- 1న రామ్‌లీలా మైదాన్ సభ అనుమతి కొనసాగుతుందన్న పోలీసులు



దిల్లీ/హైదరాబాద్, ప్రజాతంత్ర ప్రత్యేక వార్త |

అక్టోబర్ 27 :ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్') పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును హరిస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం మరోసారి ఆరోపించారు. దిల్లీలోని త్రిలోక్‌పురి బ్లాక్-20లో నిర్వహించిన 'ఓటు అధికార్, జీనే కా అధికార్' ప్రజావిచారణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్నికల వ్యవస్థలో అత్యున్నత స్థాయి నుంచే అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామా చేసే వరకు లేదా పదవి నుంచి తొలగించే వరకు ప్రతిపక్షాల ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. 30న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతీకాత్మక ప్రజా అభిశంసన నిర్వహించేందుకు ప్రతిపక్ష ఇండి కూటమి సిద్ధమవుతున్నది. దిల్లీలోని అశోక్ హోటల్‌లో నమూనా పార్లమెంట్ నిర్వహించాలని ప్రతిపాదించినప్పటికీ కార్యక్రమానికి అనుమతి లభించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఆరోపించారు. నిరసనలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అవసరమైతే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాల వద్ద కూడా ధర్నా చేస్తామని హెచ్చరించారు. దిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న ఇండి కూటమి నిర్వహించనున్న భారీ సభకు గతంలో ఇచ్చిన పోలీసు నిరభ్యంతర పత్రాన్ని ఉపసంహరించలేదని దిల్లీ పోలీసులు మంగళవారం స్పష్టం చేశారు. 25 నుంచి నవంబర్ 3 వరకు మైదానం వినియోగానికి సంబంధించిన పోలీసు అనుమతి కొనసాగుతుందని వెల్లడించారు. అయితే సభ ఏర్పాట్ల పనులను పోలీసులు అడ్డుకుంటున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే ఈ చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇండి కూటమి సభకు పది లక్షల మందిని సమీకరించాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం జరిగిన సుప్రీంకోర్టు విచారణలో ఎన్నికల సంఘం తన నిర్ణయాలను సమర్థిస్తూ దాఖలు చేసిన 248 పేజీల అఫిడవిట్ కీలకంగా మారింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ఎన్నికల సంఘం సమాధానంపై ప్రతిస్పందించేందుకు పిటిషనర్లకు పది రోజుల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ నవంబర్ 17న జరగనుంది. ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని పేర్కొంది. ఫారం-6ను చట్ట విరుద్ధంగా మార్చారన్న ఆరోపణను తిరస్కరించింది. ఓటర్ల పేర్లను చేర్చడం, తొలగించడం సంబంధిత ఎన్నికల నమోదు అధికారుల నిర్ణయాల ద్వారానే జరుగుతుందని వివరించింది. అయితే ఎన్నికల సంఘం అంతర్గత సమాచారాన్ని, నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లను భద్రపరచాలని రాహుల్ గాంధీ తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోరారు. ఈ పత్రాల ద్వారా నిర్ణయ ప్రక్రియలో సంప్రదింపులు జరిగాయో లేదో తెలుసుకోవచ్చని వాదించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డోలా సేన్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు ఎన్నికల సంఘం స్పందన కోరింది.

తెలంగాణకు సంబంధించిన మరో అంశం

తెలంగాణకు చెందిన సమాచార హక్కు కార్యకర్త ఎం.ఏ.ముజీబ్ అయ్యూబ్ 'సర్'లో ఉపయోగించే సాంకేతిక వ్యవస్థల వివరాలను కోరుతూ దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు ఎన్నికల సంఘం ఇచ్చిన సమాధానం తాజాగా వెలుగులోకి వొచ్చింది. 'సర్' కోసం ప్రత్యేకంగా కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించలేదని ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే వోటర్ల వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించేందుకు ఉపయోగించే సాంకేతిక పద్ధతులపై పూర్తి వివరాలు వెల్లడించలేదు.

ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్.. పది రోజుల గడువు

- ఈసీ అఫిడవిట్‌పై సమాధానానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ చట్టబద్ధమేనని ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- బిహార్‌లో ఫారం-6 మార్పులపై మరో పిటిషన్
- ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 27:

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు పది రోజుల గడువు ఇచ్చింది. ఎస్ఐఆర్ నిర్వహణ చట్ట నిబంధనలకు అనుగుణంగానే సాగుతోందని, ఈ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. మరోవైపు, బిహార్‌లో ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌పై కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ. మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సంఘం సోమవారం రాత్రి దాఖలు చేసిన అఫిడవిట్‌పై పది రోజుల్లోగా ప్రత్యుత్తర అఫిడవిట్ సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యురాలు దోలా సేన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీతో పాటు ఇతర సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ అయ్యాయి.

బిహార్ ఎస్ఐఆర్ సందర్భంగా ఫారం6లో మార్పులు చేశారంటూ దోలా సేన్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపిస్తూ.. ఫారం6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఉందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొంటోందని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం6లో ఎలాంటి మార్పులూ చేయలేదని 248 పేజీల అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం విచారకరమని పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈసీ తన వాదనలను కోర్టుకు సమర్పించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు చట్టబద్ధమైన అధికారం ఉందని, సంబంధిత ఉత్తర్వులను ముగ్గురు ఎన్నికల సంఘం సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపింది. అఫిడవిట్ దాఖలుకు కూడా ముగ్గురు సభ్యుల ఆమోదం ఉందని వెల్లడించింది. ఉప ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేతురు తరఫున ఈ సమాధానాన్ని దాఖలు చేసింది.

ఇదిలా ఉండగా, గత పది నెలల్లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఉత్తర్వులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సెప్టెంబర్ 25న ప్రచురితమైన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం వెల్లడించింది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సులు లేకుండానే తీసుకున్నారని వారు అభ్యంతరం తెలిపినట్లు పేర్కొంది. ఈ కథనం వెలువడిన తర్వాత ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు కూడా తెరపైకి వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్ఐఆర్ చట్టబద్ధత, ఫారం6లో మార్పుల ఆరోపణలు సుప్రీంకోర్టు విచారణలో కీలకంగా మారాయి.

తిమ్మాపూర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన జోగు ప్రభుదాస్



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27, :
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈఓ) జోగు ప్రభుదాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానాలు, అభ్యసన ప్రక్రియను సమీక్షించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యసన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న బోధనాభ్యసన సామగ్రిని పరిశీలించారు.గుణింతపు గుర్తులతో పదాల కార్డులు, ద్విత్వ పదాల ఫ్లాష్ కార్డులు, ఒత్తుల పెన్సిల్ చార్ట్, గుణింతాల పువ్వు చార్ట్ వంటి బోధనోపకరణాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, ఉపాధ్యాయులు రాములు, వరలక్షి , కృష్ణ వేణి తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న డీసీఎం.. వృద్ధుడి మృతి..



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27, :
అతివేగంతో అజాగ్రత్తగా వస్తున్న డీసీఎం వ్యాను ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వృద్ధుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణ శివారులో మంగళవారం ఉదయం జరిగింది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామానికి చెందిన కొక్కిరాల నాగారావు (80) అనే వృద్ధుడు వ్యవసాయం చేస్తూ కుటుంబ సభ్యులతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో బావికి సంబంధించిన మోటారు పాడవడంతో, రిపేరు చేయించేందుకు తన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంపై దుబ్బాకకు బయలుదేరాడు. పట్టణ శివారులోని పాత ఎల్లమ్మ గుడి సమీపంలోకి రాగానే దుబ్బాక నుంచి పెద్దచీకోడ్ వైపు అతివేగంతో అజాగ్రత్తగా వస్తున్న డీసీఎం వ్యాను, ఎదురుగా వస్తున్న వృద్ధుడి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుని తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించి, వృద్ధుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుని మనవడు రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ మహేందర్ పై దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.<

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుపై బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286వ డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం సాయంత్రం వరకు కాలనీలోనే ఉండి ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు. కాలనీలోని అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటు నమోదు ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వారు కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు భాగస్వాములు కావాలని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి
- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్



చిన్నకోడూరు, అక్టోబర్ 27, :
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ సూచించారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. మంగళవారం చిన్నకోడూరు రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయంపై దాని పరిణామాల గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మీసం మహేందర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జయంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, నవీన్, డైరెక్టర్లు భూపతి రెడ్డి, సలీమ్, అశోక్, మహిపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పరశురాం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చంద్, పంతం శ్రీనివాస్, అల్లీపూర్ ఉపసర్పంచ్ కొలన్‌పాక శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, కోరిమి రాజు, రెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సైబర్ ఉచ్చులో రైతు.. ఖాతా నుంచి రూ.1.20 లక్షలు మాయం..

- మిరుదొడ్డిలో ఘటన.. నగదు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు
- కన్నీటి పర్యంతమైన రైతు
- సిమ్ బ్లాక్ చేసిన కేటుగాళ్లు

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 27, :
సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ రైతు బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.1.20 లక్షలు మాయమైన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామంలో చోటుచేసుకుంది. కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ సంపాదించిన డబ్బు ఖాతా నుంచి మాయమవడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన రైతు మంతూరి నరేష్(37) తెలిపిన వివరాల ప్రకారం తన బ్యాంకు ఖాతాలో రూ.1.30 లక్షలు ఉండగా, ఈ నెల 26వ తేదీన సాయంత్రం రూ.675 లావాదేవీ చేశాడు. అనంతరం ఖాతాలో కేవలం రూ.7 వేలే ఉన్నట్లు మెసేజ్ రావడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా, ఈ నెల 25వ తేదీన పది సార్లు రూ.9,999 చొప్పున, 26వ తేదీన మరో రెండుసార్లు రూ.9,999 చొప్పున నగదు డ్రా అయినట్లు గుర్తించాడు. తన ఫోన్‌లో ఎలాంటి లింకులు ఓపెన్ చేయలేదని, ఎవరికీ ఓటీపీ కూడా చెప్పలేదని నరేష్ తెలిపారు. ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు కాజేసి, తన ఫోన్ సిమ్‌ను సైతం బ్లాక్ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తనకు ఈ ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని కన్నీటి పర్యంతమయ్యాడు.

పోలీసులకు ఫిర్యాదు

ఖాతాలో నగదు మాయమైన విషయాన్ని గుర్తించిన బాధితుడు మంగళవారం ఉదయం సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం బ్యాంకు స్టేట్‌మెంట్ ఆధారంగా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. తనకు జరిగిన మోసం గురించి పోలీసులకు వివరించానని, తన



నగదును తిరిగి ఇప్పించి, సైబర్ నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపుపై చర్యలు ఏవి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 27,:
ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, భవిష్యత్తులో నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశమున్న నేపథ్యంలో తాగునీటి సమస్యను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా, వ్యవసాయ బోర్ల వినియోగం, పరిశ్రమలకు నీటి తరలింపు, భూసేకరణ పరిహారం వంటి అంశాలను సమీక్షలో చర్చించారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి సరిపడా నీరు లేదని చెబుతున్న అధికారులు, గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నిరంతరాయంగా నీటిని తరలిస్తున్న వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను వినియోగించు కుంటూ బోర్ల నుంచి నీటిని తోడిపోసి ట్యాంకర్లను నింపుతున్నారని, ఈ వ్యవహారం



అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నీటిని ఇతర అవసరాలకు పెద్దఎత్తున తరలిస్తే భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను పక్కనపెట్టి పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా నీటిని తరలిస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సంగారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేపట్టిన మునిదేవునిపల్లి ప్రాంతంలో కొందరు రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు. భూముల సేకరణ, పరిహారం పంపిణీ విషయంలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. దళారులు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఇబ్బందులు పెడుతు బెదిరించి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పరిహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, పరిహారం అందని రైతులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్న చింత ప్రభాకర్, నీటి సమస్యను రాజకీయ అంశంగా కాకుండా ప్రజల జీవనాధారానికి సంబంధించిన అత్యంత కీలకమైన సమస్యగా పరిగణించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్యాంక్‌బండ్‌పై సుద్దాల హనుమంతు విగ్రహం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ జానపద అకాడమీకి ఆయన పేరు పెట్టాలి: రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజాకవి సుద్దాల హనుమంతు విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, తెలంగాణ జానపద అకాడమీకి ఆయన పేరు పెట్టాలని రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని రవీంద్రభారతిలో సుద్దాల ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ గేయ రచయిత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాకవి సుద్దాల జానకమ్మ–హనుమంతు జాతీయ పురస్కారాల సన్మాన సభ–2026లో మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ–ఐలయ్య దంపతులకు జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్‌తో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో ఉన్న తన కార్యాలయంలో మంగళవారం గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ, నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి, తన పాటలతో సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు సుద్దాల హనుమంతు అని కొనియాడారు. ప్రజల రాజ్యం రావాలనే ఆశయంతో ఆయన తన రచనల ద్వారా పేదలు, రైతుల్లో పోరాట స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు కవులు, కళాకారులు, జానపద కళాకారులను ప్రోత్సహించి వారికి తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దాల హనుమంతు సేవలకు సముచిత గౌరవం దక్కాలంటే ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ జానపద అకాడమీకి ఆయన పేరు పెట్టాలని కోరారు. ఈ విషయాన్ని శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సుద్దాల హనుమంతు స్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న గూడ పుల్లయ్య గౌడ్, రామస్వామి, బత్తిని లక్ష్మినరసు, లక్ష్మినరసింహారెడ్డి వంటి పోరాట యోధుల సేవలను కూడా స్మరించుకోవాలని అన్నారు. వారసత్వంగా వచ్చిన పోరాట స్ఫూర్తితో సుమారు 40 సంవత్సరాలుగా ఎర్రజెండా నీడలో నిరుపేదలు, రైతులు, విద్యార్థులు, యువకులు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తనకు జాతీయ పురస్కారం అందుకునే అవకాశం కల్పించిన సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సుద్దాల అశోక్ తేజ, సుధాకర్ తేజలకు గూడ ఐలయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బూదాల అమర్ బాబు, దళిత సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు ఆనంద్ బాబు, రేవంత్ రెడ్డి యువసేనకు చెందిన గూడ సాయి ప్రవీణ్ గౌడ్, అడ్వకేట్ రోహిత్ గౌడ్, సాయి పూజ గౌడ్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ గౌడ్, జనగామ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జేకే కృష్ణ, ప్రగతి శ్రీనివాస్, ప్రవీణ్, సందీప్, ప్రసన్న, భరత్, గడ్డమీద కళావతి, యాదమ్మ, బాసుపెల్లి బాలకృష్ణ, బత్తిని ఐలయ్య, నరసమ్మ, సులోచన, మంగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్వకుంట్ల వంశీధర్ రావు 53వ జన్మదిన వేడుకలు

రక్తదానం, అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ

• సేవా కార్యక్రమాలతో వేడుకలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, :
కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు 53వ జన్మదిన వేడుకలు సిద్దిపేట పట్టణంలో, నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కేవీఆర్ ఫౌండేషన్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం పట్టణంలోని పలు దేవాలయాల్లో వంశీధర్ రావు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కేవీఆర్ సేన సభ్యులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



రక్తదానం చేసిన వంశీధర్ రావు

పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వంశీధర్ రావు అభిమానులు ఉత్సాహంగా రక్తదానం చేయగా వంశీధర్ రావు సైతం స్వయంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఆయనకు గజమాల వేసి, ఖడ్గాన్ని బహూకరించి, శాలువాలతో సత్కరించారు.

సేవా కార్యక్రమాలే లక్ష్యం

ఈ సందర్భంగా కల్వకుంట్ల వంశీధర్ రావు మాట్లాడుతూ కేవీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్స్ అందించడంతో పాటు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని వెల్లడించారు. తన జన్మదినం సందర్భంగా ఇంతమంది అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కన్నారావుతో పాటు కేవీఆర్ ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌లో బంగారు పతకం.. నాడికుడి శివానిని అభినందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 27, : రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో రెజ్లింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని నాడికుడి శివానిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. 57 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి ప్రతిభ చాటిన శివానిని ఈ సందర్భంగా రాజేశ్వరరావు అభినందించి ఆశీర్వదించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, తన తల్లిదండ్రులతో పాటు కూకట్‌పల్లి ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను చాటాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కొడిచర్ల వినోద్ కుమార్, ఖైతలాపూర్ డివిజన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్, ఆయాలకు 4 నెలల పెండింగ్ వేతనాన్ని చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 27, :
ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్, ఆయాలకు నాలుగు నెలల పెండింగ్ వేతనాన్ని చెల్లించాలని, అలాగే వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యాశాఖ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ సురేఖకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్, ఆయాల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కార్య నిర్వాహక కార్యదర్శి రెహమాన్, బోయిని ప్రసాద్ సంయుక్తంగా మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కు రూ.8 వేలు, ఆయాలకు రూ.6 వేలు వేతనాన్ని చెల్లిస్తున్నారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా వారికి ప్రతినెల కాంప్లెక్స్ హెచ్ఎం అమ్మ ఆదర్శ కమిటీ అకౌంట్‌లో కాకుండా వారి అకౌంట్లోనే నెలకు రూ.26 వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని, ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలి వారి అటెండెన్స్ రిజిస్టర్ మీద ఉన్నతాధికారులు అటెస్టెడ్ చేయాలి ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇస్తున్నట్టు సిఎల్ లీవ్ ఇవ్వాలని లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్, ఆయాల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు నీరెడి సాయిలు, తెలంగాణ రాష్ట్ర ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్ ఆయా యూనియన్ అధ్యక్షులు కవిత, ప్రధాన కార్యదర్శి విజయ, తులసి, నవీన, కీర్తన, నాగమణి, చందన, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి అఖిల్ రాజ్ ఫౌండేషన్ అండ

మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27, :
దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చికోడ్ గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని అఖిల్ రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు పరామర్శించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ ఆదేశాల మేరకు ఫౌండేషన్ దుబ్బాక మండల అధ్యక్షుడు పాకనాటి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి, వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్ ప్రతినిధులు, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుప రవి, కంకణాల చంద్రం, రాములు, వనం పోచయ్య, కేశర స్వామి, వెంకటేష్, రెడ్ శేట్ నారాయణ శేట్, రాహుల్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27, :
దుబ్బాక మండలం తిమ్మాపూర్ రైతువేదికలో తిమ్మాపూర్, ఆసన్‌మీరాపూర్, అప్పనపల్లి గ్రామాల రైతులకు పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జనుము పంటల సాగుపై శాస్త్రవేత్తలతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక వ్యవసాయ సహాయ సంచాలకుడు కాంపాటి మల్లయ్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, వర్మీ కంపోస్టు, పశువుల ఎరువులను ఉపయోగించడం ద్వారా భూసారం కాపాడుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, జనుము, కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు.



ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ సదుపాయం ఉందని తెలిపారు. తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రమాదేవి మాట్లాడుతూ వరి పంట తర్వాత పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సిద్దిపేట సమన్వయకర్త డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఒక ఎకరం వరికి అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల మొక్కజొన్న, ఐదు ఎకరాల పొద్దుతిరుగుడు, ఎనిమిది ఎకరాల జనుము పంటలను సాగు చేయవచ్చని వివరించారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ బైబ్యాక్ ఒప్పందం ద్వారా రైతులకు జనుము విత్తనాలు అందించి, పంట దిగుబడి వచ్చిన తర్వాత క్వింటాలుకు రూ.13,300 చొప్పున కొనుగోలు చేస్తోందన్నారు. తక్కువ నీటితో సాగయ్యే జనుము పంటలో ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, అప్పనపల్లి సర్పంచ్ రామ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, తిమ్మాపూర్ ఉపసర్పంచ్ విజయ్, ఏఈవో రేణుక, ఎఫ్‌పీవో డైరెక్టర్ నారాయణ, సీఈవో భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెట్ బషీరాబాద్ సీఐ శ్రీధర్ రెడ్డికి సన్మానం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, :
సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పెట్ బషీరాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ రెడ్డిని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పందిరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ధర్మారంలో ఎయిడ్స్, టీబీపై కళాజాతతో అవగాహన

• ఆటపాటలతో ఆరోగ్యంపై చైతన్యం

• వివక్షకు దూరంగా ఉండాలని సూచన

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 27, :
ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మంగళవారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్కోప్ ప్రాజెక్టు పీడీ ఉప్పలయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు ఆటపాటల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైంగికంగా సంక్రమించే వ్యాధుల లక్షణాలు కనిపిస్తే సంబంధిత ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న గర్భిణులు తల్లి నుంచి బిడ్డకు వైరస్ సంక్రమించే ప్రమాదాన్ని తగ్గించేందుకు పీపిటీసీటీ కేంద్రాల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. ఎయిడ్స్ సాధారణ స్పర్శ, కలిసి భోజనం చేయడం వంటి చర్యల ద్వారా వ్యాపించదని, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపట్ల వివక్ష చూపకుండా గౌరవంగా వ్యవహరించాలని కళాకారులు వివరించారు. టీబీ లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, కళాకారులు భుజంగం, లావణ్య, చిరంజీవి, కృష్ణ, స్కోప్ సిబ్బంది స్రవంతి, అనూష, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నవంబర్ 2 న తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

• విజయవంతం చేయాలని ఆదివాసి సంఘాల ఐక్యవేదిక పిలుపు

దమ్మపేట, అక్టోబర్ 27, :
దమ్మపేట మండల కేంద్రంలో మంగళవారం ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో నవంబర్ 2 దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ముట్టడి కోసం విధివిధానాలు చర్చలో ఏజెన్సీ ప్రాంతంలో ఒకటి బై 70 చట్టం అమలు చేయాలని, జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త జీవో ఏర్పాటు చేసి ఆదివాసి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, భూమి అడవిపై ఆదివాసులకు హక్కులు కల్పించాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు కొర్సా వెంకటేష్ దొర, బండారు సూర్యనారాయణ, తంబళ్ల రవి కాకా శివశంకర్ ప్రసాద్, కొర్సా వీదరాజు, పెనుబల్లి రమేష్, కారం నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

• సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఎమ్మెల్యే హరీష్ బాబు సంఘీభావం


ఆసిఫాబాద్, అక్టోబర్ 27, :
ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణపై ప్ర: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయం ఎదుట గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సంఘీభావంగా ఆయన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యను ప్రస్తావించి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఉద్యోగులను క్రమబద్ధీక రించిన విధానాలను పరిశీలించి, తెలంగాణలోనూ అదే తరహాలో చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగేల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్.

మిరుదొడ్డిలో తేనెటీగల దాడి.. ఏడుగురికి గాయాలు..

- ఐదుగురు విద్యార్థులు, లెక్చరర్, రైతుకు గాయాలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 27, :

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో తేనెటీగల దాడి కలకలం రేపింది. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు, ఓ లెక్చరర్, అటుగా వెళ్తున్న రైతు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఓ చెట్టు నుంచి ఒక్కసారిగా లేచిన తేనెటీగలు అటుగా వెళ్తున్న విద్యార్థులు, లెక్చరర్, రైతుపై దాడి చేసి కుట్టాయి. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు గాయపడిన వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కళాశాల సమీపంలో తేనెటీగల దాడి జరగడంతో విద్యార్థులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు.



బాలల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన న్యాయాధికారులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, :


బాలల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారిపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని న్యాయాధికారులు సూచించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అసురక్షిత పరిస్థితులను గుర్తించి, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట జిల్లాలోని పలు పాఠశాలల్లో బాలల రక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వెల్కటూరు, మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రశాంత్ నగర్‌లోని స్ప్రింగ్ డాలెస్ ఉన్నత పాఠశాలతో పాటు సిద్దిపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వెల్కటూరు, మిట్టపల్లి, ప్రశాంత్ నగర్ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం-2012లోని ముఖ్యమైన అంశాలను వివరించారు. పిల్లలపై లైంగిక వేధింపులు జరగకుండా అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కుమార స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కుల గురించి తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా మౌ నంగా ఉండకుండా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని తెలిపారు. పిల్లలకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం, వారిలో ధైర్యాన్ని నింపడం, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సైబర్ క్రైమ్స్ డీఎస్పీ రాజు, ఎస్ఐ దివ్య, చైల్డ్ ప్రొటెక్షన్ వింగ్‌కు చెందిన గణేష్, వెల్కటూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, మిట్టపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్, స్ప్రింగ్ డాలెస్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రక్ పార్కు స్థలం ప్రజలకే

- హుడా స్థలాన్ని విక్రయించొద్దు, క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, పార్కు నిర్మించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి



మాధవరం కృష్ణారావు, యం.ఎల్.ఎ
కూకట్‌పల్లి నియోజకవర్గం-46

ఇ.నెం.5-3-437/2, శేషాద్రి నగర్,
వెంకట్రామినగర్, కూకట్‌పల్లి,
హైదరాబాదు - 500072.
9347056789,9394115559

తేదీ: 26.10.2026

శ్రీయుత. గౌ ॥ ఎనుముల రేవంత్ రెడ్డి గార్కి
ముఖ్యమంత్రివర్యులు
తెలంగాణ రాష్ట్రం.

విషయం: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న హుడా ట్రక్ పార్కు స్థలాన్ని విక్రయించవద్దని, స్థానిక ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించాలని వినతి..

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట గ్రామ సర్వేనంబర్లు 121పి నుండి 141,146,147,155 నుండి 157 వరకూ గల హుడా ట్రక్ పార్కు స్థలంలో సుమారు 3 ఎకరాల 15 గుంటల భూమిని హెచ్ఎండీఏ అధ్వర్యంలో విక్రయించాలనే నిర్ణయంచడంతో పాటు ఈ వేలం ప్రకటనను కూడా ఈనెల 24న విడుదల చేశారు. ఇక్కడి చాలావు 30 ఎకరాల భూమిని కూకట్‌పల్లి, మూసాపేట గ్రామాలకు చెందిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వ అవసరాల రీత్యా హైదరాబాద్ నగరానికి రాకపోకలు సాగించే వాహనాల పార్కింగ్ లాట్ ఏర్పాటు కోసమని సేకరించారు. అయితే నగరం విస్తరించిన నేపథ్యంలో కూకట్‌పల్లిలోని ట్రక్ పార్కు ను ఔటర్ రింగ్ అవతలకి షిఫ్ట్ చేయడంతో ఇక్కడి భూములు ఎక్కువగా నిరుపయోగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే గడిచిన సంవత్సరం గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్‌రెడ్డి గారికి ఇక్కడి ట్రక్‌పార్కు భూములను స్థానికంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కేటాయించాలని కోరడం జరిగింది. ప్రధానంగా యువతకు క్రీడల కోసం క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియాల నిర్మాణం, అథ్లెటిదృతిమైన విశాలమైన పార్కు నిర్మాణం కోసం కేటాయించాలని కోరడం జరిగింది. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం కూడా ఇక్కడి భూములను వినియోగించాలని విన్నవిస్తూ వినతి పత్రం కూడా అందజేయడం జరిగింది. మా వినతి ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే హెచ్ఎండీఏ అధికారులు ఇక్కడి భూములో సుమారు 3.15 ఎకరాలు విక్రయానికి పెడుతూ బహిరంగ ప్రకటన కూడా జారీ చేయడం ఆశ్చర్యకరం. రోజురోజుకూ నగరం విస్తరిస్తూ కాంక్రీట్ జంగలను తలపిస్తున్న తరుణంలో నగరంలోని వివిధ ప్రభుత్వ భూములను అమ్ముకొని సొమ్ముచేసుకోకుండా ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా తమరు మా వినతిని మన్నించి ఇక్కడి భూములను విక్రయించకుండాప్రజలకు ఉపయోగపడేలా క్రికెట్ స్టేడియంతో పాటు క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దడం మరియు విశాలమైన పార్కుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కూకట్‌పల్లి ప్రాంతంలో అత్యవసరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి హుడా ఇక్కడి భూములను వినియోగించాలని కోరుతున్నాము.

ఇట్లు
మాధవరం కృష్ణారావు యం.ఎల్.ఎ.
కూకట్‌పల్లి నియోజకవర్గం -46

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 27, :

కూకట్‌పల్లిలోని హుడా ట్రక్ పార్కు స్థలాన్ని విక్రయించకుండా ప్రజా అవసరాలకే కేటాయించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ నెల 24న జారీ చేసిన భూముల ఈ-వేలం ప్రక్రియలో ట్రక్ పార్కు స్థలాన్ని చేర్చడంపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని వేలం వేయకుండా కూకట్‌పల్లి ప్రజలకు ఉపయోగపడేలా క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, పార్కు నిర్మాణాలకు కేటాయించాలని కోరారు.ప్రాంత యువతకు క్రీడా సదుపాయాలు కల్పించడంతోపాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రక్ పార్కు స్థలం వేలాన్ని నిలిపివేసి, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి.. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. మంగళవారం షాపూర్ నగర్‌లోని తన నివాసంలో చింతల్, గాజులరామారం, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్ సర్కిళ్లకు చెందిన పలువురు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలు ప్రస్తావించిన



సమస్యలపై స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ కొన్ని సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియ సులభతరం చేసేందుకు తన కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు కావాలి: శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పించాలని దుండిగల్ పురపాలక తొలి చైర్‌పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కాలనీ సభ్యులు, పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేయాలని ఆమె కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ డివిజన్ మల్లంపేట్ సాయి బాలాజీ కాలనీలో మంగళవారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు, బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మాదాస్ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ రాఘవేందర్ గౌడ్, బీఆర్ఎస్ సర్కిల్ వైస్ ప్రెసిడెంట్



శామీర్‌పేట్ రంగయ్య, మాజీ వార్డు సభ్యుడు బాలకృష్ణ, నాయకులు అశోక్, బీఆర్ఎస్వీ నాయకుడు కుంట్ల మనీష్‌తో పాటు కాలనీ సభ్యులు జైవీర్, భూపాల్, శ్రవణ్, రమేష్, సుంకన్న, లక్ష్మీనారాయణ, రాజేందర్ రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

- వెల్ఫేర్ అసోసియేషన్ చొరవతో రంగంలోకి దిగిన వాటర్ బోర్డు అధికారులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో గత రెండు రోజులుగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. డ్రైనేజీ సమస్య కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు స్పందించి, హైదరాబాద్ వాటర్ బోర్డు జనరల్ మేనేజర్‌కు ఫోన్ ద్వారా సమస్యను వివరించి ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జనరల్ మేనేజర్, వాటర్ వర్క్స్ మేనేజర్



శివప్రసాద్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపించారు. మంగళవారం కాలనీకి చేరుకున్న శివప్రసాద్ డ్రైనేజీ సమస్యను స్వయంగా పరిశీలించి, రెండు హైటెక్ లారీలను ఏర్పాటు చేసి మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్‌హోల్ వరకు డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయించే పనులను ప్రారంభించారు. కాలనీవాసులను గత కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన వాటర్ బోర్డు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, బచ్చ జ్ఞానేశ్వర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, కాలనీవాసులు సందీప్, వసంత చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 27, :

వెలమ సంక్షేమ మండలి జగిత్యాల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జగిత్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సురేందర్ రావు, కేడీసీసీ జిల్లా సభ్యులు రామచందర్ రావు, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు, పాక్స్ చైర్మన్లు దామోదర్ రావు, సందీప్ రావు, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- నవంబర్ 6లోపు ఓటరు నమోదు చేసుకోవాలి: ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శివరాత్రి యాదగిరి పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకునేందుకు 2026 నవంబర్ 6 చివరి తేదీ అని ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కుత్బుల్లాపూర్‌లోని ట్రస్మా కార్యాలయంలో ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, పట్టభద్రులు తమ హక్కును వినియోగించుకోవడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గాల వివరాలు

మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం:

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాలు.

వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం:

వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి–భువనగిరి జిల్లాలు.

ఓటరు నమోదుకు అర్హతలు, ముఖ్యమైన తేదీలు

విద్యార్హత: 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.

నమోదు గడువు: 2026 నవంబర్ 6.

దరఖాస్తు విధానం: ఫారం–18 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

తుది ఓటరు జాబితా: 2026 డిసెంబర్ 30.

ఎన్నికలు: 2027 మార్చిలో నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.



అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని డాక్టర్ శివరాత్రి యాదగిరి కోరారు. పట్టభద్రుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చే నాయకులను ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలకు చేరువగా పోలీస్ శాఖ.. గ్రామ భద్రతకు పెద్దపీట..

- ఇందుప్రియాల్‌లో 16 సీసీ కెమెరాలు, గ్రామ గ్రంథాలయం ప్రారంభం
- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, :
ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తూ, గ్రామాల్లో శాంతిభద్రతలను బలోపేతం చేయడమే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ శాఖ చేపట్టిన 'మన పోలీస్–మన ఊరు' కార్యక్రమం ప్రజల్లో అవగాహన పెంచుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సందర్శించారు. గ్రామానికి చేరుకున్న సీపీకి గ్రామస్తులు కోలాటాలతో, బంజారా గిరిజనులు సంప్రదాయ ఆటపాటలు, నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు.

గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు రక్షణ కవచం

గ్రామాల్లో నేరాలను అరికట్టడంతోపాటు, నేరాలకు సంబంధించిన ఆధారాలను త్వరగా సేకరించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. ఇందుప్రియాల్ గ్రామంలో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇతర గ్రామాల ప్రజలు కూడా ఇందుప్రియాల్‌ను ఆదర్శంగా తీసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాలను నిరంతరం పనిచేసేలా ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలని కోరారు.

యువత పుస్తక పఠనంపై దృష్టి పెట్టాలి

యువతకు ఉపయోగపడేలా గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని సీపీ తెలిపారు. యువత స్మార్ట్‌ఫోన్లకు, అంతర్జాలానికి అతిగా అలవాటు పడకుండా పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయం, ప్రభుత్వ పాఠశాల గోడలపై పోలీసుల ఆధ్వర్యంలో చిత్రించిన రహదారి భద్రత, మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన చిత్రాలను సీపీ పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, అంతర్జాల నేరాలపై అవగాహన కల్పించే రంగవల్లుల పోటీలను తిలకించి అభినందించారు. పాఠశాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు.

మాదకద్రవ్యాల విక్రయాలపై సమాచారం ఇవ్వండి

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని సీపీ హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వాటికి బానిసైన వారికి తగిన చికిత్స అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక అవగాహన నాటికలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. రహదారి భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై లఘుచిత్రాలను ప్రదర్శించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు గ్రామ యువతకు, పోలీసు బృందానికి మధ్య నిర్వహించిన వాలీబాల్ పోటీని సీపీ ప్రారంభించారు.

రహదారి మరమ్మతులు చేపట్టిన పోలీసులకు అభినందనలు

ఇందుప్రియాల్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన దౌల్తాబాద్ పోలీసులు సుమారు 1.5 కిలోమీటర్ల మేర గుంతలను పూడ్చివేశారు. ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టిన పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, ఎదురుదిశలో వాహనాలు నడపకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సీపీ సూచించారు. రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. నకిలీ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఒకసారి వినియోగించే రహస్య సంకేత సంఖ్య (ఓటీపీ) ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించ కూడదని సూచించారు. అంతర్జాల మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల మోసపోయిన డబ్బును నిలిపివేసి తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఆడపిల్లలకు ఉన్నత విద్య అందించి, వారు స్వతంత్రంగా జీవించే స్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

ప్రజల కోసమే పోలీసుల సేవలు

ఈ సందర్భంగా సీపీ సాధన రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో ప్రారంభించిన 'మన పోలీస్–మన ఊరు' కార్యక్రమాన్ని ఇప్పటికే అన్ని పోలీస్ సర్కిళ్ల పరిధిలో నిర్వహించామని తెలిపారు. పోలీసులు ప్రజల కోసమే పనిచేస్తున్నారనే నమ్మకాన్ని ప్రజల్లో పెంపొందించడం, పోలీసులకు ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. సమాజంలో జరిగే నేరాలు, చట్టాలు, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, ఏఆర్ సుభాష్ చంద్రబోస్, గజ్వేల్ ఏసీపీ నరసింహులు, తొగుట సీఐ శ్రీను, ఇన్‌స్పెక్టర్ లతీఫ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణు ప్రసాద్, దౌల్తాబాద్ ఎస్సై అరుణ్, ఎస్సైలు నవీన్, బాలకృష్ణ, రేణుక, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.



కాంగ్రెస్ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా షేక్ నవాజ్ బాధ్యతల స్వీకరణ

- బండి రమేష్ సమక్షంలో ఘనంగా పదవీ బాధ్యతల స్వీకారం

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 27, :
కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ నవాజ్ మంగళవారం ఘనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జనతా నగర్‌లోని తన నివాసం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా హేమదుర్గా భవన్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన గౌరవం,అవకాశాలు కల్పిస్తుందని, మైనారిటీల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని అన్నారు. షేక్ నవాజ్ మైనారిటీల సమస్యలను గుర్తించి, వారి గొంతుకగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.షేక్ నవాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బండి రమేష్‌కు, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ హుస్సేన్, తూము వేణు, లక్ష్మయ్య, గోపిశెట్టి రాఘవేందర్, ఎండీ చున్ను పాషా, ఎండీ సలీం, తూము వినయ్, పులి శివ, సప్పిడి భాస్కర్, తూము సంతోష్, కాలికోట శంకర్, రాజేష్ గౌడ్,ఎండీ నయీమ్, రమణ, అక్బర్, మల్లేష్ యాదవ్, అస్లాం, తూము సచిన్, ఎండీ యూసఫ్ పాషా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని షేక్ నవాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన వారికి షేక్ నవాజ్ ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.



ఆయిల్‌ఫామ్ రైతులు అధికారుల సూచనలు పాటించాలి

- 51 ఎకరాల ఆయిల్‌ఫామ్ తోటలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించిన మండల కమిటీ
- తోటల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి: మండల కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు

వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 27, :
ఆయిల్‌ఫామ్ రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ, తోటల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వర్ధన్నపేట మండల ఆయిల్‌ఫామ్ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంట దిగుబడులు తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాలకు చెందిన ఏడుగురు రైతులకు సంబంధించిన 51 ఎకరాల ఆయిల్‌ఫామ్ తోటలను మండల కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్ చెట్ల పెరుగుదల, తోటల నిర్వహణ, కలుపు నివారణ, మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు ఆయిల్‌ఫామ్ పంటపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, వాటిని అధిగమించేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తోటల్లో కలుపు నివారణకు ఉపయోగిస్తున్న యంత్రాలను పరిశీలించి, వాటి వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

తోటల సందర్శన సందర్భంగా రైతులు తమ సమస్యలను కమిటీ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. డ్రిప్ సేద్య పరికరాలు, నిచ్చెనలపై రాయితీ, తోటల మీదుగా వెళ్తున్న విద్యుత్ స్తంభాల తొలగింపు, ఉచిత సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. ఆయిల్‌ఫామ్ సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ పంట అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎర్రం నాగరాజు, మునుకుంట్ల ఐలయ్య, బలరాం, వెంకటేశ్వర్ రావుతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రంగానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జన్ను లక్ష్మణరావు విజయం

- 10 ఓట్ల మెజార్టీతో గెలుపు.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 27, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ ఎన్నికల్లో జన్ను లక్ష్మణరావు తన సమీప ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుడు బండారు వరప్రసాద్‌పై 10 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన జన్ను లక్ష్మణరావుకు 87 ఓట్లు రాగా, బండారు వరప్రసాద్‌కు 77 ఓట్లు వచ్చాయి. దీంతో జన్ను లక్ష్మణరావు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు సాంబశివరావు, గొరిగే మధు, కృష్ణారావు ప్రకటించారు. కాలనీలో మొత్తం 172 ఓట్లు ఉండగా, 164 ఓట్లు పోలయ్యాయని, వివిధ కారణాలతో ఎనిమిది ఓట్లు పోలవలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. విజయం అనంతరం జన్ను లక్ష్మణరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో వర్గ విభేదాలకు తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే సంక్షేమ సంఘం పూర్తి కమిటీని ఏర్పాటు చేసి, కాలనీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. జన్ను లక్ష్మణరావు విజయం సాధించడంతో కాలనీవాసులు, బస్తీ పెద్దలు బాణసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



ఆదివాసీ జేఏసీ అధ్వర్యంలో కొమరం భీమ్ 86 వ వర్ధంతి

దమ్మపేట, అక్టోబర్ 27, :
ఆదివాసీ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గోండు బెబ్బులి కొమరం భీమ్ 86 వ వర్ధంతిని దమ్మపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఆదివాసీల హక్కులు, భూమి, అటవీ వనరుల పరిరక్షణ కోసం కొమరం భీమ్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొమరం భీమ్ కేవలం ఒక పోరాట యోధుడు మాత్రమే కాదని, ఆదివాసీల ఆత్మగౌరవానికి, హక్కుల సాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. నిజాం పాలనలో గిరిజనులు ఎదుర్కొన్న అన్యాయాలు, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ఆదివాసీలకు తమ భూములపై హక్కులు ఉండాలని, అడవులు, నీరు, భూమి వంటి సహజ వనరులపై వారి జీవనాధార హక్కులను కాపాడాలని ఉద్యమించారని తెలిపారు.



"జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాట స్ఫూర్తి

కొమరం భీమ్ పేరు వినగానే గుర్తుకు వచ్చేది "జల్, జంగల్, జమీన్" అనే నినాదమని నాయకులు పేర్కొన్నారు. నీరు, అడవి, భూమిపై ఆదివాసీల హక్కులను ప్రతిబింబించే ఈ నినాదం నేటికీ గిరిజన ఉద్యమాలకు స్ఫూర్తినిస్తోందన్నారు. ఆదివాసీల సంప్రదాయాలు, సంస్కృతి, జీవన విధానం, భూమి హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. కొమరం భీమ్ నిజాం పాలనకు వ్యతిరేకంగా ఆదిలాబాద్ ప్రాంతంలోని గోండు గిరిజనులను సంఘటితం చేసి పోరాటానికి నాయకత్వం వహించారు. జోడేఘాట్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని సాగించిన ఆయన ఉద్యమం ఆదివాసీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నాయకులు గుర్తుచేశారు. 1940లో జోడేఘాట్ ప్రాంతంలో జరిగిన పోరాటంలో ఆయన ప్రాణత్యాగం చేశారని తెలిపారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

ప్రస్తుత పరిస్థితుల్లోనూ ఆదివాసీలు తమ భూములు, అటవీ హక్కులు, రాజ్యాంగ బద్ధమైన రక్షణల కోసం అప్రమత్తంగా ఉండాలని జేఏసీ నాయకులు అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూముల పరిరక్షణకు సంబంధిత చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, భూ బదలాయింపు లపై ఉన్న నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొమరం భీమ్ ఆశయాలను మాటలకే పరిమితం చేయకుండా, ఆదివాసీ యువత ఆయన పోరాట చరిత్రను తెలుసుకుని హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయన త్యాగం, ధైర్యం, పోరాట పటిమ ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ నాయకులు కోర్స వెంకటేష్ దొర, కుంజా చిన్నబాబు, పద్దం విజయలక్ష్మి , సున్నం శ్రీనివాసరావు, మొడియం వెంకటేశ్వర్లు, కారం నాగేంద్రబాబు, కోర్స వీదరాజు, కాకా శివ శంకర్ వరప్రసాద్, పెనుబల్లి రమేష్, వెలకం బాబురావు, ఇర్సా వీరస్వామి, సోడియం వెంకటేశ్వరరావు, కూరం ప్రసాద్, సున్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల/కోరుట్ల, అక్టోబర్ 27, :

జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియను మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, భూ యజమానుల వివరాలు, అందుబాటులో ఉన్న భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రీ-సర్వే ద్వారా భూముల వివరాలు, సరిహద్దులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చుకోవాలని అధికారులకు తెలిపారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ-సర్వే పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం



జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, :

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీస్ అమరవీరుల సంస్మరణలో(పోలీస్ ఫ్లాగ్ డే) భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు, వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ విధానం, సీసీ కెమెరాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేసే విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాలు, డయల్ 112 సేవలు, రిసెప్షనిస్ట్ పనితీరు, 24 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండే డిపార్ట్మెంట్ పోలీస్ డిపార్ట్మెంట్ అని, పాత నేరస్తులను గుర్తుపట్టడానికి ఫింగర్ ప్రింట్ ద్వారా గుర్తించడం లాంటి వివిధ అంశాలపై పోలీసు ఆయుధాల పనితీరు, సంఘవిద్రోహ శక్తుల చేతిలో చనిపోయిన పోలీస్ అమరవీరుల గురించి, భరోసా సెంటర్, షి టీమ్ పోలీసులు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉదేశ్యంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది .విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని పని విధానం ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పోలీస్ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

నూతన్‌కల్‌లో ఘనంగా బైక్ ర్యాలీ



నూతన్‌కల్, అక్టోబర్ 27, :

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నూతన్‌కల్ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. నూతన్‌కల్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సమాజ రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన వీర పోలీస్ సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ స్మరణీయమని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నిరుపయోగంగా గ్రంథాలయ భవనం

- చీలాపూర్ గ్రంథాలయాన్ని పరిశీలించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం
- పుస్తకాలు, ర్యాకులు, ఫర్నిచర్ కల్పనకు కృషి చేస్తాం
- గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, :

గ్రామీణ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయ భవనం నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉండటం విచారకరం. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం చీలాపూర్ గ్రామంలో ప్రారంభోత్సవం జరిగినప్పటికీ, కనీస సౌకర్యాలు లేక పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం మంగళవారం పరిశీలించారు. గ్రంథాలయ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ పుస్తకాలు, పుస్తకాల ర్యాకులు, కుర్చీలు, బల్లలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో గ్రామ ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు, పుస్తక పఠనంపై ఆసక్తి ఉన్నవారికి ఉపయోగపడాల్సిన గ్రంథాలయం ఇన్నాళ్లుగా వినియోగంలోకి రాకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దరిపల్లి చంద్రం జిల్లాలోని 17 గ్రంథాలయాలను సందర్శించి, వాటి పరిస్థితులను సమీక్షించినట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, అవసరమైన పుస్తకాలు, ర్యాకులు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చీలాపూర్ గ్రామ గ్రంథాలయాన్ని కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని దరిపల్లి చంద్రం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధి ద్వారా విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తోడ్పాటు అందించవచ్చని అన్నారు.

గ్రంథాలయాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలి

ప్రారంభోత్సవం జరిగిన గ్రంథాలయ భవనం నాలుగేళ్లుగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం పట్ల గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రంథాలయానికి అవసరమైన వసతులు కల్పించాలని కోరుతున్నారు. భవనం సిద్ధంగా ఉన్నప్పుడు పుస్తకాలు, ర్యాకులు, ఫర్నిచర్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే గ్రామంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే కేంద్రాలు మాత్రమే కాదు గ్రామీణ యువత భవిష్యత్తుకు బాటలు వేసే విజ్ఞాన కేంద్రాలు. చీలాపూర్ గ్రంథాలయాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామ ప్రజల ఆశలను నెరవేర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శానగొండ సరూప రాణి భాస్కరాచారి, ఉపసర్పంచ్ రాధారం హరీష్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సన్న వడ్ల సాగుతో రైతులకు సత్ఫలితాలు

- మార్కెట్లో పెరిగిన డిమాండ్, అధిక దిగుబడులు సాధించిన రైతులకు సన్మానం



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27, :

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే రైతులకు మెరుగైన ఫలితాలు లభిస్తాయనే లక్ష్యంతో రైస్ మిల్ అసోసియేషన్ ఐదు నెలల క్రితం కల్పించిన అవగాహన సత్ఫలితాలను ఇస్తోంది. అసోసియేషన్ సూచనల మేరకు సన్న వడ్ల సాగు చేపట్టిన దుబ్బాక మండల రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు, ప్రస్తుతం మార్కెట్లో పెరిగిన డిమాండ్‌తో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక మండలంలోని రైతులకు గత ఐదు నెలల క్రితం రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్న వడ్ల సాగుపై అవగాహన కల్పించారు. మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సన్న రకాల వరిని సాగు చేయాలని సూచించారు. ఈ సూచనలతో సన్న వడ్ల సాగు చేపట్టిన పలువురు రైతులు మంచి దిగుబడులు సాధించారు. ప్రస్తుతం సన్న వడ్లకు మార్కెట్లో గిరాకీ పెరగడంతో రైతుల్లో సంతోషం నెలకొంది. ఈ నేపథ్యంలో దుబ్బాక మండలంలో సన్న వడ్ల సాగు చేసి ఉత్తమ దిగుబడులు సాధించిన రైతులను దుబ్బాక మండలం చెర్వాపూర్‌లోని శివశక్తి రైస్ మిల్లులో మంగళవారం ఘనంగా సన్మానించారు. రైస్ మిల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చింతరాజు, ఏఎంసీ చైర్మన్ కొంగరి రవి రైతులను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. రైతులకు పంట సాగుకు ముందే అవగాహన కల్పించడం వల్ల ఆశించిన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. సన్న వడ్ల సాగులో అధిక దిగుబడులు సాధించిన రైతులను సన్మానించడం ఇతర రైతులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. రైతుల అవసరాలు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై బి ఆర్ ఎస్ ఫోకస్

- ఓటర్ నమోదును వేగవంతం చేయాలని నేతలకు పిలుపు



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 27, :

శేరిలింగంపల్లి నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచించారు.నిజాంపేట్‌లోని కోలన్ రాఘవ రెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. గతంలో ఓటు వేసిన పట్టభద్రులు సైతం ప్రస్తుత నిబంధనల ప్రకారం తిరిగి తమ పేర్లను నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రతి నాయకుడు తన ఇంటి నుంచే ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులతో పాటు కాలనీలు, డివిజన్లలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో సమయాన్ని వృథా చేయకుండా నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విధానాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు, యువతకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేలా, మెజారిటీ సాధించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చింతలు తీర్చేందుకే ప్రజల చెంతకు

- రేగులపల్లిలో 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'
- అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి
- గ్రామ సమస్యలపై ఆరా.. అభివృద్ధి పనులపై సమీక్ష



మానకొండూర్/బెజ్జంకి, అక్టోబర్ 27, :

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో చేపట్టిన 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమంలో భాగంగా మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం బెజ్జంకి మండలం రేగులపల్లి గ్రామంలో పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పుం లక్ష్మి , గైని జ్యోతి, దుగ్యాని లావణ్య, గాండ్ల పద్మ, నరాల ఐలవ్వ, జంగిలి రజిత, నిషాని రాధవ్వ, ఉత్కం పద్మ, మాతంగి అనసూర్య, బోనగిరి భవాని, రేకొండ రేవతి, తాళ్ల మల్లీశ్వరి, బండారి రాధ తదితర లబ్ధిదారుల ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలు, నిర్మాణ పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి చింతలు తీర్చేందుకే 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకు వస్తున్నట్లు తెలిపారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రేగులపల్లి గ్రామానికి 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయకముందే అదనపు ఇళ్ల కోసం కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరుపుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ పర్యటనలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిలో ట్రాన్స్‌కోకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత ఏఈని ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జంగిలి లక్ష్మి – తిరుపతి,ఎంపీడీవో కె. ప్రవీణ్ కుమార్, బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, వైస్ చైర్మన్ పర్ష సంతోష్, ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం పర్షరాం, ఎంపీవో ఖలీం, మండల వ్యవసాయ అధికారి సంతోష్, ట్రాన్స్‌కో ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ఏ అనిత, ఆర్ఐ, జీపీవో ప్రశాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొట్టె రాజిరెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, జీల లింగం, భైర సంతోష్, ప్రసాద్, భూమిరెడ్డి, జె. సంపత్, ఎర్రోజు రాజు తదితరులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాఫీ పొడి..

కాఫీ పొడితో దోమలను తరిమికొట్టొచ్చు. కాఫీ పొడి వాసనకు దోమలు పారిపోతాయి. రెండు స్పూన్ల కాఫీ పొడిని ఒక గిన్నెలో తీసుకొని దానిని కాల్చాలి. అప్పుడు వచ్చే పొగకు దోమలు పారిపోతాయి. చాలా సేపటి వరకు మీ ఇంట్లో మళ్లీ దోమలు కనిపించవు.



వెల్లుల్లి..

మనం వంటకు ఉపయోగించే మరో వస్తువు వెల్లుల్లి. దీని వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మనకు తెలుసు. అయితే.. ఈ వెల్లుల్లితోనే దోమలను తరిమి కొట్టచ్చంటే మీరు నమ్ముతారా? కొన్ని వెల్లుల్లి రెబ్బలను చూర్ణం చేసి నీటిలో ఉడకబెట్టాలి. దీని తర్వాత మీరు ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో నీటిలో వేయాలి. దీని తర్వాత దోమలు వచ్చే చోట స్ప్రే చేయాలి. ఇంటి మూలలో లేదా ఏదైనా రంధ్రంలో ఈ వెల్లుల్లి మిశ్రమాన్ని స్ప్రే చేయాలి. అంతే.. దోమలు పరారౌతాయి.



ఇలా చేశారంటే .. ఇంట్లోకి ఒక్క దోమకూడా రాదు

కాలంతో సంబంధం లేకుండా దోమల బెడద వేదిస్తూ ఉంటుంది. ఇక దోమలతో వచ్చే రోగాలు అన్నీ ఇన్నీ కావు.. డెంగ్యూ లాంటి ప్రాణాంతక జబ్బులు కూడా ఉన్నాయి. అయితే దోమల నివారణకు మార్కెట్ లో రకరకల ప్రాడక్ట్స్ అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వాడితే సైడ్ ఎఫెక్ట్స్ కూడా వచ్చే చాన్స్ ఉంది. దీంతో దోమల నివారణకు వంటింట్లో దొరికే కొన్ని సుగంధద్రవ్యాలు, పదార్థాలను వాడుకోవచ్చు.. అవేంటో ఈ కథనంలో చూసేద్దాం.

లవంగాలు..

ఇక మనకు ఇంట్లో లవంగాలు సులభంగానే లభిస్తాయి. ఈ లవంగాలను ఇంట్లో పలు ప్రదేశాల్లో ఉంచండి. లవంగాల వాసనకు కూడా దోమలు తొందరగా ఇంట్లోకి రావు. ఇంట్లో కిటికీలు.. కిచెన్, హాల్ టేబుల్స్ పై వీటిని ఉంచండి. అంతే.. దోమలు పరారౌతాయి.



కర్పూరం.

నూనెలో కర్పూరం వేసి మిశ్రమాన్ని సిద్ధం చేయండి. మీరు ప్రతిరోజూ సాయంత్రం ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. కావాలంటే ఈ మిశ్రమాన్ని ఇంట్లో కూడా స్ప్రే లాగా చల్లుకోవచ్చు. కర్పూరం వాసనకు దోమలు పారిపోతాయి. ఈ హోం ట్రిక్స్ పాటించడం వల్ల... మీరు దోమలను పారదోలొచ్చు.



గంటల తరబడి కూర్చొని పనిచేస్తున్నారా..

డేంజర్ బెల్స్ మోగినట్టే..

గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేయడం ఈ రోజుల్లో వేరీ కామన్. ఐటీ, నాన్ ఐటీ ఎంప్లాయీస్ కూడా ఈ పని తప్పడం లేదు. దీనికి తోడు తీవ్రమైన ఒత్తిడి మధ్య పనిచేయాల్సి వస్తోంది. అయితే గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చొని పనిచేయడం.. స్మోకింగ్ కంటే డేంజర్ అని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. గంటల తరబడి ఒకే దగ్గర కూర్చొని పనిచేస్తే ఎటువంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు చూద్దాం..



డిప్రెషన్ ముప్పు..

కూర్చొని పని చేయడం వల్ల ప్రవర్తన మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. డిప్రెషన్, యాంగ్జయిటీ పెరిగే ప్రమాదం ఉంది. నిరాశ, ఆందోళన లాంటి లక్షణాలు ఏర్పడుతాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు వీలైనంత వరకు వ్యాయామం చేయాలి. తరచుగా విరామం తీసుకోవడం వల్ల కూడా ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది.



ఊబకాయం

ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల క్యాలరీల ఖర్చు తగ్గి ఈజీగా బరువు పెరుగుతారు. ఫలితంగా ఒబేసిటీ ఏర్పడుతుంది. అందుకే, తరచుగా లేచి నడుస్తూ ఉండాలి. అలా చేయడం వల్ల ఊబకాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.



అప్పడప్పుడూ లేచి నడవండి..

గంటల పాటు కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గి ఆయుష్షు మీద తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వీలైనంత వరకు ఎక్కువ సేపు కూర్చోవడాన్ని తగ్గించాలంటున్నారు నిపుణులు. లేదంటే ఆరోగ్యంతో పాటు దీర్ఘాయువును పెంచేందుకు సరిపడ శారీరక శ్రమను కల్పించాలి. వీలైనంత వరకు మధ్య మధ్యలో లేచి నడవడం ఉత్తమం. తరచుగా కాసేపు బ్రేక్ తీసుకోవడం మంచిది. ఈ గ్యాప్ లో కాసేపు వర్కౌట్స్ చేయడం కూడా ఆరోగ్యానికి మేలు కలిగిస్తుంది.





జ్వరంతోనే హర్మన్ సెంచరీ!

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 : జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వీరోచిత పోరాటం చేసింది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, పెయిన్‌కిల్లర్స్ వేసుకుని బరిలోకి దిగి అద్భుత సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఆమె చూపించిన పోరాట పటిమపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. "మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి జ్వరం వచ్చింది. ఫీల్డింగ్ చేసేటప్పుడు చాలా ఇబ్బంది పడి విశ్రాంతి తీసుకోవాలనుకున్నా. కానీ పెయిన్‌కిల్లర్స్ సాయపడ్డాయి" అని హర్మన్ తెలిపింది. జ్వరాన్ని లెక్కచేయకుండా ఏకంగా 43 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఆమె 121 బంతుల్లో 126 పరుగులు సాధించింది. ఆమెకు తోడుగా దీప్తి కూడా సెంచరీ చేయడంతో భారత్‌కు తిరుగులేకుండా పోయింది.

ఆటను ఆస్వాదిస్తున్నా..

ఇటీవలే టీమిండియా కెప్టెన్సీ నుంచి తప్పుకున్న హర్మన్.. ఆ భారం లేకుండా ఆడుతున్న తొలి సిరీస్ ఇదే కావడం గమనార్హం. దీనిపై ఆమె స్పందిస్తూ.. "బ్యాటింగ్ చేసేటప్పుడు ఇతర విషయాలు అస్సలు ఆలోచించను. బ్యాటర్‌గా పరిస్థితికి తగ్గట్టు ఎలా ఆడాలి అన్నదే ముఖ్యం. ప్రస్తుతం నా బ్యాటింగ్‌ను పూర్తిగా ఆస్వాదిస్తున్నా" అని చెప్పుకొచ్చింది.

పుంజుకున్న భారత్ 'ఏ'!



వెల్లింగ్టన్, అక్టోబర్ 27 : న్యూజిలాండ్ 'ఏ'తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ 'ఏ' అద్భుతంగా పుంజుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే కుప్పకూలి 204 పరుగుల వెనుకంజలో నిలిచిన జట్టు.. మూడో రోజు అనూహ్యంగా పటిష్ట స్థితికి చేరుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 106/2తో సోమవారం ఆట ప్రారంభించిన భారత్ తరఫున దేవదత్ పడిక్కల్ (199) అసాధారణ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అయితే అంపైర్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంతో ఒక్క పరుగు తేడాతో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు. పడిక్కల్‌కు తోడుగా సాయి సుదర్శన్ (91) మూడో వికెట్‌కు 215 పరుగులు జోడించాడు. తృటిలో అతడూ సెంచరీ మిస్ చేసుకున్నాడు. అనంతరం వచ్చిన యశ్ రాథోడ్ (66), వాషింగ్టన్ సుందర్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'ఏ' 8 వికెట్లకు 488 పరుగులు చేసింది. ప్రస్తుతం టీమిండియా 284 పరుగుల లీడ్‌లో ఉంది. మంగళవారం ఆఖరి రోజు కావడంతో భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి కివీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించే అవకాశం ఉంది.

ముగిసిన జాతీయ ఆర్చరీ పోటీలు!

అహ్మదాబాద్, అక్టోబర్ 27 : అహ్మదాబాద్‌లోని సంస్కార్‌ధామ్ విజయా భారత్ స్పోర్ట్స్ అకాడమీలో 8వ ఐఎస్ఎస్ఓ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2026ఉ27 ఘనంగా ముగిసింది. అదానీ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న 56 పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలురు, బాలికలకు ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ రౌండ్లలో ఈ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హర్యానాకు చెందిన అంతర్జాతీయ ఆర్చర్ (విలువిద్య క్రీడాకారిణి) తమ్నా దేశ్వాల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలవడానికి క్రమశిక్షణ, నిరంతర సాధన ముఖ్యమని ఆమె క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆదిత్య నిమ్మగడ్డ, నాని బెట్సీ, పి. తరుణ్ ప్రణీత్, ధనియెల్లా, నిఖిల్ రాజ్ తదితర యువ ఆర్చర్లు టైటిల్స్ కైవసం చేసుకున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని ఐఎస్ఎస్ఓ డైరెక్టర్ ఆకాంక్ష థాపాక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



టీమిండియా విధ్వంసం!

13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్య ఛేదన

- 35 బంతుల్లోనే అభిషేక్ శర్మ సెంచరీ
- 3-0తో టీ20 సిరీస్ కైవసం
- కివీస్‌పై టీమిండియా సరికొత్త చరిత్ర!

వెల్లింగ్టన్, అక్టోబర్ 27 : న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన మూడో టీ20లో కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే ఊదేసి, ఆరు వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. విదేశీ గడ్డపై బ్యాటర్లు కనబరిచిన విశ్వరూపం భారత క్రికెట్ ఆధిపత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

ఆకాశమే హద్దుగా అభిషేక్ శర్మ..

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ రాణించడంతో కివీస్ మంచి టార్గెట్ నిర్దేశించింది. 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ప్రారంభం నుంచే విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన యువ సంచలనం అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లోనే తొమ్మిది ఫోర్లు, 11 సిక్సర్లతో ఏకంగా 113 పరుగులు చేసి మెరుపు సెంచరీ సాధించాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీతో కలిసి కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి ఓవర్‌లోనే 26 పరుగులు రాబట్టారు. కేవలం 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సులభంగా ఛేదించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత అభిషేక్ శర్మ మైదానంలో పద్మాసనంలో కూర్చొని 'ఓం నమఃశివాయ' మంత్రాన్ని జపిస్తూ ధ్యానం చేయడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది.

పవర్‌ప్లేలో ప్రపంచ రికార్డు..

ఈ మ్యాచ్‌లో పలు అరుదైన రికార్డులు నమోదయ్యాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ అత్యధికంగా 118 పరుగులు సాధించి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో 190కి పైగా లక్ష్యాన్ని అతి తక్కువ బంతులు మిగిలి ఉండగా ఛేదించిన పూర్తి సభ్య దేశంగా భారత్ నిలిచింది. భారత బ్యాటర్లు ఆడిన తీరు నమ్మశక్యంగా లేనట్లుగా ఉందని శ్రేయస్ అయ్యర్ ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో కేవలం ఐదు ఓవర్లలోనే వంద పరుగులు చేయడం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. విదేశీ గడ్డపై ఇలాంటి భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొని అద్భుతంగా రాణించడం సంతోషంగా ఉందని, ఈ జోరును రాబోయే మ్యాచ్‌లలో నూ కొనసాగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కోహ్లీ రికార్డు బద్దలు..

భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 35 బంతుల్లోనే శతకం బాది విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఈ సెంచరీతో టీ20 క్రికెట్‌లో తన మొత్తం శతకాల సంఖ్యను 11కు పెంచుకున్న అభిషేక్.. పది సెంచరీలతో విరాట్ కోహ్లీ పేరిట ఉన్న ఆల్‌టైమ్ భారత రికార్డును బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లో అభిషేక్‌కు ఇది నాలుగో శతకం కాగా, ఈ క్రమంలో విరాట్ కోహ్లీ, డేవిడ్ వార్నర్ వంటి దిగ్గజాల రికార్డులను అధిగమించాడు. అంతేకాకుండా ఎదుర్కొన్న తొలి బంతికే అత్యధిక సార్లు సిక్స్ బాదడం, టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్ సాధించడం వంటి పలు అరుదైన రికార్డులను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.

పాకిస్థాన్‌కు ఘోర పరాభవం!

- వన్డే ట్రై సిరీస్‌లో శ్రీలంక చేతిలో చిత్తు
- 110 పరుగులకే కుప్పకూలిన పాక్ బ్యాటర్లు
- ఐదు వికెట్లతో చెలరేగిన దిల్షాన్ మధుషంక
- 8 వికెట్లతో ఘన విజయం.. ఫైనల్స్‌కు లంక

లాహోర్, అక్టోబర్ 27 : శ్రీలంకతో జరిగిన వన్డే ట్రై సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. ఈ గెలుపుతో శ్రీలంక జట్టు దర్జాగా ఫైనల్స్‌కు చేరుకోగా.. ఇంగ్లాండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు శ్రీలంక బౌలర్ల దాటికి కేవలం 25.3 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. స్వదేశంలో పాకిస్థాన్‌కు ఇది రెండో అతి తక్కువ వన్డే స్కోరు కావడం గమనార్హం. బాబర్ ఆజమ్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

చెలరేగిన మధుషంక..

శ్రీలంక యువ పేసర్ దిల్షాన్ మధుషంక అద్భుతమైన బౌలింగ్‌తో చెలరేగాడు. కేవలం 34 పరుగులు ఇచ్చి ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టాడు. ఫఖర్ జమాన్, అరాఫత్ మిన్హాస్, హరీస్ రౌఫ్, షాహీన్ అఫ్రిదిలను అవుట్ చేసి పాకిస్థాన్ పతనాన్ని శాసించాడు. సాహన్ అర్చిగే రెండు వికెట్లు తీయగా.. అసిత్ ఫెర్నాండో, మలింగ, దునిత్ వెల్లలగే చెరో వికెట్ దక్కించుకున్నారు.

మెండిస్ మెరుపులు..

అనంతరం 111 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు కేవలం 18.1 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి సులభంగా లక్ష్యాన్ని ఛేదించింది. మెండిస్ అజేయంగా 62 పరుగులు, పవన్ రత్నాయకే 23 పరుగులతో రాణించి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ అద్భుత విజయంతో పాకిస్థాన్‌పై శ్రీలంక ఐదు మ్యాచ్‌ల ఓటమి పరంపరకు తెరదించింది. నవంబర్ 11న జరిగే ఫైనల్ మ్యాచ్‌లో మళ్లీ శ్రీలంక, పాకిస్థాన్ జట్లే అమీతుమీ తేల్చుకోనున్నాయి.



‘జైలర్ 2‘ నుంచి ‘రోడీ‘ థీమ్ రిలీజ్!

హృతిక్ రోషన్ పాత్ర కోసం అనిరుధ్ స్పెషల్ మ్యూజిక్

యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న ఇన్‌స్ట్రుమెంటల్ ట్రాక్

40 ఏళ్ల తర్వాత రజనీకాంత్, హృతిక్ కాంబో

హైదరాబాద్, అక్టోబర్ 27 : సూపర్ స్టార్ రజనీకాంత్ బ్లాక్ బస్టర్ హిట్ ‘జైలర్ 2’ బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ సినిమా విజయోత్సాహంలో ఉన్న చిత్రబృందం.. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ పోషించిన ‘రోడీ’ పాత్రకు సంబంధించిన స్పెషల్ థీమ్ మ్యూజిక్‌ను తాజాగా విడుదల చేసింది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ పవర్‌ఫుల్ ఇన్‌స్ట్రుమెంటల్ ట్రాక్ యూట్యూబ్‌లో విశేషంగా ఆకట్టుకుంటోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది.

40 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే తెరపై..

ఈ చిత్రంలో టైగర్ ముత్తువేల్ పాండియన్‌కు క్లిష్ట పరిస్థితుల్లో సాయం చేసే మిత్రుడిగా హృతిక్ ‘రోడీ’ పాత్రలో అదరగొట్టారు. ఈ సినిమాతో ఆయన తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వడం విశేషం. కాగా, దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రజనీకాంత్, హృతిక్ మళ్లీ ఒకే తెరపై కనిపించారు. 1986లో వచ్చిన ‘భగవాన్ దాదా’ చిత్రంలో హృతిక్ బాలనటుడిగా రజనీతో కలిసి నటించారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, రమ్యకృష్ణ, విద్యా బాలన్, విజయ్ సేతుపతి లాంటి భారీ తారాగణంతో వచ్చిన ‘జైలర్ 2‘ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.





పడమటివీధి జానకి!

బర్త్‌డే సందర్భంగా రితికా నాయక్ ఫస్ట్ లుక్ రిలీజ్


హైదరాబాద్, అక్టోబర్ 28 : సందీప్ కిషన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘పవర్ పేట‘. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న రితికా నాయక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె ‘పడమటివీధి జానకి‘ అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హీరోయిన్‌కు హీరో సందీప్ కిషన్ సోషల్ మీడియా వేదికగా బర్త్‌డే విషెస్ తెలిపారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డిల నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేమ, గౌరవం, రాజకీయాల మేళవింపుతో ఈ కథ ఉండబోతోందని తెలుస్తోంది. ఇందులో సందీప్ కిషన్ ‘సేనాపతి రవి‘ పాత్రలో నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రితికా నాయక్ క్రీమ్ కలర్ హాఫ్ శారీ, సంప్రదాయ ఆభరణాలతో చాలా అందంగా కనిపించారు. పోస్టర్‌తో పాటు విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె ట్రెడిషనల్ లుక్ నుంచి ట్రెండీ అవతార్‌లోకి మారుతూ విభిన్న షేడ్స్‌లో మెప్పించారు. కృష్ణ చైతన్య కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్టుగా వస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 60 శాతం పూర్తయింది. ఈ చిత్రానికి మధి సినిమాటోగ్రఫీ, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.



ఆదర్శ కుటుంబం ఏకే 47కి గుడ్‌న్యూస్!

అమరావతి, అక్టోబర్ 27 : విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన ‘ఆదర్శ కుటుంబం ఏకే 47’ సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకోవడంతో పాటు, రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.75, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50 వరకు అదనంగా వసూలు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిర్మాత ఎస్. రాధాకృష్ణ విజ్ఞప్తి మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్. గతంలో వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ విజయవంతం కాగా.. ఇప్పుడు నేరుగా త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా వస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.





‘వారణాసి‘ కేవలం టైమ్ ట్రావెల్ కాదు!

మహేశ్ సినిమాపై రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 27 : ఆర్ఆర్ఆర్ లాంటి ప్రపంచస్థాయి విజయం తర్వాత దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న ‘వారణాసి‘ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా కేవలం టైమ్ ట్రావెల్ కథ కాదని, అద్భుతమైన సాహస యాత్ర అని రాజమౌళి తాజాగా స్పష్టం చేశారు. ఇటీవల ఓ బ్రెజిలియన్ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమా స్కేల్‌ను మాటల్లో చెప్పలేమన్న జక్కన్న.. అందుకే గతేడాది గ్లింప్స్ విడుదల చేశామన్నారు. కథా నేపథ్యం గురించి రాజమౌళి మరింత లోతుగా వివరించారు. “దీన్ని టైమ్ ట్రావెల్ కథగా చూడొద్దు. ఇది వేర్వేరు ప్రపంచాల మీదుగా సాగే అడ్వెంచర్. అంటార్కిటికా నుంచి ఆఫ్రికాకు, అక్కడి నుంచి వారణాసికి ప్రయాణం సాగుతుంది. అలాగే వేర్వేరు యుగాల్లోకి ముఖ్యంగా పురాణ యుగంలోకి కూడా వెళ్తాం. అక్కడ భారీ జీవులు, దేవుళ్లను, అలాంటి ఎన్నో అంశాలను చూస్తారు“ అని ఆయన వెల్లడించారు.

ఇంత భారీ హంగులతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు తండ్రీకొడుకుల మధ్య ఉండే భావోద్వేగమే అసలు కథ అని రాజమౌళి నొక్కి చెప్పారు. ఆ బలమైన ప్రేమ, బంధమే ఈ మొత్తం కథను ముందుకు నడిపిస్తుందని స్పష్టం చేశారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మహేశ్ బాబు ‘రుద్ర’గా, ప్రియాంక చోప్రా ‘మందాకిని’గా నటిస్తున్నారు. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ‘కుంభ’ అనే ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు.



అనిరుధ్-కావ్య పెళ్లి పత్రిక వైరల్!

చెన్నై, అక్టోబర్ 27 : సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్ వివాహ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐవరీ, లేత నీలం రంగుల కలయికతో బరోక్ శైలిలో దీన్ని రూపొందించారు. అందమైన పెట్టెలో ఎంబాస్ చేసిన పత్రాలు, పాతకాలపు శైలి ముద్రలతో ఈ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ జంట వివాహం గ్రీస్‌లో సన్నిహిత కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. నవంబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరిగే అవకాశం ఉంది. అయితే దీనిపై జంట నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. నవంబర్ 21న చెన్నైలో గ్రాండ్‌గా రిసెప్షన్ జరగనుంది. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులకు ఆహ్వానాలు అందుతున్నాయి. కావ్య తల్లిదండ్రులు కళానిధి మారన్, కావేరి మారన్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com